తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-22- జూలై - 2025 | సంపుటి : 3 | సంచిక : 56 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# రేవంత్ రెడ్డికి రాహుల్ అపాయింట్‌మెంట్ దక్కలేదు

- ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు ఎప్పుడు సమయం కోరినా ఇచ్చారన్న ఎన్ రామచందర్ రావు
- సొంత పార్టీ సీఎంకు రాహుల్ గాంధీ ఎందుకు సమయం ఇవ్వడం లేదని నిలదీత
- బీజేపీ మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమన్న తెలంగాణ బీజేపీ అధినేత
- తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్ రామచందర్ రావు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 46 సార్లు ఢిల్లీకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ లభించలేదని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను మాత్రం కలిశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. ప్రధాని, కేంద్ర మంత్రులు ఆయన ఎప్పుడు కోరినా సమయం ఇచ్చారని గుర్తు చేశారు. కానీ సొంత పార్టీ ముఖ్యమంత్రికి రాహుల్ గాంధీ ఎందుకు సమయం ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించారు.

మిగతా 2లో

# జీవో 49పై ప్రభుత్వం కీలక నిర్ణయం!

- ఆదివాసీలకు శుభవార్త చెప్పిన తెలంగాణ ప్రభుత్వం
- 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' జీవోను నిలుపుదల చేసిన ప్రభుత్వం
- ఆదివాసీల ఆందోళనలు నివృత్తి చేసే వరకు జీవో అమలు నిలిపి ఉంచాలన్న ప్రభుత్వం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందించింది. 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో

# ఉన్నతాధికారులకు సీఎం వార్నింగ్

- భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సీఎం ఆదేశం
- ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలి
- హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలు ఏర్పాటు
- జిల్లాల్లో పిడుగుపాటు కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలి
- అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు
- సీఎం రేవంత్ రెడ్డి

2లో



# కుల వృత్తుల బాగోగులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక
- కులవృత్తులను భూస్థాపితం చేయాలని చూస్తున్నారని ఆరోపణ
- కల్లు దుకాణాలను బంద్ చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్న శ్రీనివాస్ గౌడ్


హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కులవృత్తులను భూస్థాపితం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్తీ పేరిట పూర్తిగా గీత వృత్తిని రూపుమాపేయాలని దురాలోచన చేస్తోందని బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు దుకాణాలను బంద్ చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

2లో

# భూముల ధరలు రివర్స్ అయ్యాయి

- తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఇదివరకు ఏపీలో 10 ఎకరాలు వచ్చేదన్న హరీశ్ రావు
- ఇప్పుడు ఏపీలో ఎకరం అమ్మితే తెలంగాణలో రెండు ఎకరాలు వస్తోందన్న మాజీ మంత్రి
- రాష్ట్రంలోని మెజార్టీ పరిషత్‌లు గెలుచుకుంటామని హరీశ్ రావు ధీమా



2లో


# వరల్డ్ కప్‌లో దూసుకు పోతున్న కోనేరు హంపి

- సెమీస్ కు చేరిన తొలి భారతీయ మహిళగా రికార్డు
- వరల్డ్ కప్ లో హంపి విజయం సాధించాలని ఆకాంక్షించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ లో తెలుగు తేజం, భారత గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి దూసుకుపోతోంది. వరల్డ్ కప్ సెమీస్ కు ఆమె చేరుకుంది.

2లో





# భాగ్యనగర వాసులకు బిగ్ అలర్ట్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ మహానగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. మంగళవారం సాయంత్రం 5 నుంచి 8 గంటల మధ్య భారీ వర్షం కురిసే అవకాశముందని ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడిరచారు. అత్యవసరమైతే తప్ప.. అనవసరంగా ప్రయాణాలు చేయవద్దని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

మిగతా 3లో

# కాంగ్రెస్ నేత హత్యకేసులో సంచలన విషయాలు

- ఐదుగురు అరెస్టు
- ఘటన స్థలంలో 4 బుల్లెట్లు..
- మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు




మెదక్, (తెలంగాణ ముచ్చట్లు)

కాంగ్రెస్ కీలక నేత అనిల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. గతంలో రవీందర్‌రెడ్డికి అనుచరుడిగా అనిల్ ఉన్నారు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. సోమవారం మెదక్‌లోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అనిల్ హత్య కేసుకి సంబంధించిన వివరాలు వెల్లడిరచారు మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు. ఈనెల (జులై) 14న కాంగ్రెస్ నేత అనిల్‌ను కాల్పులు జరిపి హత్య చేశారని చెప్పుకొచ్చారు.

ఈ కేసులో ఏ 1 కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి. ఏ2 నాగరాజు, ఏ 3 నాగభూషణంలని చేర్చామని తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని... మరో ఇద్దరినీ త్వరలోనే పట్టుకుంటామని అన్నారు. ముగ్గురికి అనిల్ అంటే ద్వేషం ఉందని అన్నారు. అనిల్ హైదరాబాద్‌తో సహా పలుచోట్ల ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేశారని తెలిపారు.

2లో

# నాయకులు ఇప్పటికైనా భాష మార్చుకోవాలి

- మీరు మాట్లాడే భాషను ప్రజలు చీదరించుకుంటున్నారు
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాజకీయ నాయకులు మాట్లాడే భాష వింటున్న ప్రజలు చీదరించుకుంటున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో భాషా వ్యవహారం పూర్తిగా దిగజారిందని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నాయకుడు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు మాట్లాడే భాష మార్చుకోవాలని సూచించారు. తద్వారా తమ గౌరవాన్ని నిలుపుకోవాలని చెప్పారు. నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నాయకులు ఇప్పటికైనా తమ భాషను మార్చుకోవాలన్నారు. ఉచిత పథకాలు రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని చెప్పారు. అందువల్ల ఉచితాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. లేనట్లయితే దేశ ఆర్థిక వ్యవస్థ నలిగిపోతుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా అవినీతి రోజురోజుకు పెరిగిపోతున్నదని తెలిపారు. ఎన్నికల ఖర్చులపై నియంత్రణ లేకపోవడమే అవినీతి పెరుగుదలకు ప్రధాన కారణమన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. నేతల మధ్య పరస్పర దాడులు మంచివికాదని, సభ బయట సభ్యుల మధ్య జరిగే దాడులపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని వెల్లడిరచారు.

మంగళవారం-22- జూలై 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రేవంత్ రెడ్డికి రాహుల్ అపాయింట్‌మెంట్ దక్కలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం కేంద్రం బాధ్యత అని చెబుతున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ ఎలా తీసుకువచ్చారని నిలదీశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని అన్నారు. అసాధ్యమని తెలిసినప్పటికీ బిల్లు తీసుకురావడం సరికాదని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బిల్లు తీసుకువచ్చారని ఆరోపించారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై నిందలు వేస్తే సహించేది లేదని అన్నారు. ముస్లింలకు ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్ తొలగించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే సుప్రీంకోర్టు కూడా అనుమతించదని రామచందర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని ఎలా నడపాలనే విషయమై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు తాను ఢిల్లీ వచ్చానని ఆయన వెల్లడిరచారు.

# కుల వృత్తుల బాగోగులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు

(మొదటి పేజీ తరువాయి)



గౌడ సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. కుల వృత్తుల బాగోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆయన ఆరోపించారు. మొదట ఔటర్ రింగు రోడ్డు లోపల, ఆ తర్వాత ఔటర్ రింగు రోడ్డు బయట కల్లును నిషేధించాలని భావిస్తున్నట్లు అర్థమవుతోందని అన్నారు. కల్లు కాంపౌండుపై నిషేధం విధిస్తే లక్షలాది మంది రోడ్ల మీద పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్లును బంద్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లిక్కర్ కంపెనీలు, డిస్టిలరీలు అన్నీ ఒకరిద్దరు చేతుల్లోనే నడుస్తున్నాయని ఆయన అన్నారు. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తి పడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని అన్నారు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ కల్లును అరికట్టడంలో ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు.






# కాంగ్రెస్ నేత హత్యకేసులో సంచలన వియాలు

(మొదటి పేజీ తరువాయి)





కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి, అతని భార్య లక్ష్మీలకు అనుచరుడిగా అనిల్ ఉన్నారని వివరించారు. లక్ష్మీ మరణం తర్వాత రవీందర్‌రెడ్డికి, అనిల్‌కు విభేదాలు వచ్చాయని చెప్పారు.

పెట్రోల్ బంకు విషయంలో ఇద్దరికి గొడవలు జరుగుతున్నాయని అన్నారు. రవీందర్ రెడ్డికి సంబంధించిన 12 ఎకరాల భూమి విషయంలో వివాదం ఉందని తెలిపారు. గ్రామంలోనూ తనపై అనిల్ దుష్ప్రచారం చేస్తున్నారని రవీందర్ రెడ్డి కోపం పెంచుకున్నారని అన్నారు. నాగభూషణం, నాగరాజులకు అనిల్‌తో గొడవలు ఉన్నాయని తెలిపారు.

**`ఘటన స్థలంలో 4 బుల్లెట్లు..**

‘ఈ నెల 14న రాత్రి 8 గంటలకు వరిగుంతం వద్ద అనిల్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కానీ ముందు యాక్సిడెంట్ అనుకున్నారు. కానీ అనిల్ బాడీపై బుల్లెట్ గాయాలు ఉండటంతో ఘటన స్థలానికి వెళ్లాం. ఘటన స్థలంలో 4 బుల్లెట్ షల్స్ లభించాయి. ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలతో దర్యాప్తు ప్రారంభించాం. అనిల్ హత్య కేసుని లోతుగా దర్యాప్తు చేశాం. కుటుంబ సభ్యులను విచారణ చేసి అనుమానితులను విచారించాము. ఇందులో రవీందర్ రెడ్డి, నాగరాజు, ఫరిద్ విజయవాడకు చెందిన చిన్నా హత్యలో ఉన్నారు. మొత్తం ఏడుగురు అనిల్ హత్యలో పాల్గొన్నారు. రవీందర్ రెడ్డి అనిల్ మధ్య మొదట్లో మంచి సంబంధాలు ఉండేవి. రాను రాను ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. రవీందర్ రెడ్డి భూమిని అనిల్ కౌలుకు చేశాడు ఆ సమయంలో వివాదం ఏర్పడిరది. రవీందర్ రెడ్డి, అనిల్ మధ్య గ్రామంలో గొడవలు మొదలయ్యాయి. రవీందర్ రెడ్డి భూమిని అమ్మనివ్వకుండా అనిల్ అడ్డుపడ్డాడు. నాగరాజు అనే వ్యక్తి సర్పంచ్‌గా పోటీ చేస్తా అంటే అనిల్ బెదిరించాడు’ అని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

# జీవో 49పై ప్రభుత్వం కీలక నిర్ణయం!

(మొదటి పేజీ తరువాయి)



జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలును నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జీవో 49 ద్వారా కొమురంభీమ్ ఆసిఫాబాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలును నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది

# ఉన్నతాధికారులకు సీఎం వార్నింగ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 21 శాతం వర్షపాతం నమోదైందన్నారు. ఇది తక్కువ వర్షపాతమని ఆయన పేర్కొన్నారు. అయితే గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలను ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే బృందాలను పంపిస్తున్నామని చెప్పారు. పోలీస్ కమిషనరేట్లల్లోని ఉన్నతాధికారులు గ్రౌండ్ స్థాయిలో ఉండాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాల్లో పిడుగుపాటు కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని వారికి వివరించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం సైతం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఈ కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ప్రతీ రోజు జిల్లా కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందించాలని సీఎస్ రామకృష్ణారావును ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని..సాగునీటికి సంబంధించి వాటర్ మేనేజ్‌మెంట్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డిగ అభిప్రాయపడ్డారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేయడం ద్వారా దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. యూరియా స్టాక్‌కు సంబంధించి ప్రతీ ఎరువుల దుకాణం వద్ద స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్టాక్ డిటైల్స్ ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత ఉన్నట్లు కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కావాల్సినంత యూరియా స్టాక్ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోండంటూ ఆధికారులను ఆదేశించారు. రైతుల కంటే ఏదీ ముఖ్యం కాదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా సీఎం రేవత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. గతంలో రేషన్ షాపులపై ఆసక్తి ఉండేది కాదని.. సన్న బియ్యంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగిందన్నారు. అంతేకాదు రేషన్ కార్డు విలువ, రేషన్ షాపు విలువ పెరిగిందన్నారు. జులై 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరపాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

# భూముల ధరలు రివర్స్ అయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)



ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక భూముల ధరలు రివర్స్ అయ్యాయని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఒకప్పుడు తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఏపీలో పది ఎకరాలు వచ్చేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఏపీలో ఎకరం భూమి అమ్మితే తెలంగాణలో రెండు ఎకరాలు వస్తోందని అన్నారు. రేవంత్ రెడ్డికి పాలన చేతకాక తెలంగాణలో ఇలాంటి పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ, మరో రెండేళ్లు కాంగ్రెస్ పాలన కొనసాగితే భూముల రేట్లు సగానికి పడిపోతాయని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రుణమాఫీ 30 పైసలు, ఎగ్గొట్టింది 70 పైసలు అని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలోని 31 జిల్లా పరిషత్‌లలో 1618 బీఆర్ఎస్ సొంతం చేసుకోబోతుందని తేలిందని అన్నారు. సిద్ధిపేటలోని మెజార్టీ మండలాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ఎలా ఉండేది, కాంగ్రెస్ హయాంలో ఎలా అయిందో ప్రజలకు అర్థమైందని అన్నారు. 12 వేల ఉద్యోగాలు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో లక్షా 68 వేల ఉద్యోగాలు ఇచ్చారని ఆయన వెల్లడిరచారు. నాడు అశోక్ నగర్ వెళ్లిన రాహుల్ గాంధీ ఇప్పుడు పత్తా లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి అశోక్ నగర్‌లో విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయని అన్నారు.

# వరల్డ్ కప్‌లో దూసుకుపోతున్న కోనేరు హంపి

(మొదటి పేజీ తరువాయి)



తద్వారా వరల్డ్ కప్ లో సెమీస్ కు చేరిన తొలి భారతీయ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. నిన్న జరిగిన క్వార్టర్ ఫైనల్లో కోనేరు హంపి చైనాకు చెందిన యుక్సిన్ సాంగ్ పై 1.50.5 తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలో ఆమెకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కోనేరు హంపికి శుభాకాంక్షలు తెలియజేశారు. వరల్డ్ కప్ సెమీస్‌కు చేరిన హంపికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానని రేవంత్ అన్నారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా హంపి నిలవడం తెలుగు ప్రజలకు గర్వకారణమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వరల్డ్ కప్ లో ఆమె ఘన విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. కోనేరు హంపికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. మరోవైపు ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్ ముఖ్ మధ్య జరిగిన క్వార్టర్స్ టైబ్రేకర్ కు వెళ్లింది. తొలి గేమ్ ను డ్రా చేసుకున్న వీరిద్దరూ... రెండో గేమ్ లోనూ పాయింట్స్ పంచుకున్నారు. ఈ క్రమంలో, వీరి టైబ్రేకర్ నేడు జరగనుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# భాగ్యనగర వాసులకు బిగ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)




ట్రాఫిక్ పోలీసులు, హైదరాబాద్ నగర పాలక సంస్థ, డీఆర్ఎఫ్ అందించే సమాచారాన్ని తెలుసుకుని.. వారి సూచనలు పాటించాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరంలో సైతం ఇటీవల పలు రోజులపాటు వరుసగా వర్షాలు కురిసిన విషయం విదితమే. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు ప్రభుత్వం ఇప్పటికే సూచించింది. అలాగే ఉన్నతాధికారులకు సైతం ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో.. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బందిని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. మరోవైపు జులై 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే భారత వాతావరణ విభాగం వెల్లడిరచిన సంగతి తెలిసిందే. అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాల్లో సైతం భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ వర్షాలు.. సోమ, మంగళవారాలే కాకుండా.. మరో రెండు రోజులు వరకు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. మరి ముఖ్యంగా తూర్పు, దక్షిణ, మధ్య తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే ఉదయం, సాయంత్రమే కాకుండా రాత్రి సమయాల్లో సైతం భారీ వర్షం కురుస్తుందని వివరించింది.

# మొక్కలు నాటండి భవిష్యత్తును నిర్మించండి

- జమాతే ఇస్లామిక్ హింద్ విజ్ఞప్తి
- పది లక్షల మొక్కలు నాటేందుకు సి ఐ ఓ లక్ష్యం
- విలేకరుల సమావేశంలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:




చేతులు మట్టిలో దేశభక్తి హృదయాంలో అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా మిషన్ ప్లాంటేషన్ లో భాగంగా జమాతే ఇస్లామిక్ హింద్, చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 10 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు జమాతే ఇస్లామిక్ హింద్( సి ఐ ఓ) అధ్యక్షురాలు ఆస్మా అంజుమ్, సెంట్రల్ అధ్యక్షురాలు ఆస్వియా అంజుమ్ లు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మొక్కలు నాటాలనే సంకల్పంతో ఒక మంచి సామాజిక కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే లక్షలాది మొక్కలు నాటడం జరిగిందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి భవిష్యత్తును నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ చిన్నారులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని తమ వంతు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక యజ్ఞల చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఐఓ నాయకురాలు పాయిజ, నజియా, హుస్నేన్ బి, పర్వీన, సుల్తానా, ఫాతిమా, సరిహా, అబ్దుల్, అక్ష, అఙ్మన్, సమీరా, గౌస్య, ఇక్బాల్, అసిఫా, లిజ, ముస్ఫర, తదితరులు పాల్గొన్నారు.


# చేతిరాత నిజ జీవితంలో మేలు కలిగిస్తుంది

- చేతిరాత... భవిష్యత్తుకు బాట.
- రాత బాగుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:



మెరుగైన చేతిరాత చదువు, మార్కులు కోసం మాత్రమే కాదు, నిజ జీవితంలో కూడా ఎంతో మేలు చేస్తుంది.మన రాత బాగుంటే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చేతిరాత నిపుణులు రమేష్ పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో చేతిరాత మెరుగుదలకు శిక్షణ ఇస్తున్న రమేష్ సోమవారం సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సులువైన పద్ధతిలో చేతిరాత మెరుగుదలకు సూచనలు చేశారు. పెన్ను/ పెన్సిల్ తప్పుగా పట్టుకోవడం, ఇరికించి రాయడం, దృష్టిలోపం, పెన్ను (పెన్సిల్) పట్టుకునే విధానం సరిగా లేకపోవడం తదితర కారణాలచే అందమైన చేతిరాత అందని ద్రాక్షగా మారుతుందని పేర్కొన్నారు. చేతిరాత మెరుగుపడాలనే బలమైన కోరిక కలగడంతో పాటు నిటారుగా కూర్చుని రాయడం తెలుసుకోవాలని సూచించారు. పెన్ను (పెన్సిల్) అదిమి(వత్తి) పట్టి రాయడం వలన రైటింగ్ స్పీడ్ తగ్గడంతో పాటు చేతి వేళ్ళు నొప్పులు రావడం ద్వారా విద్యార్థులు త్వరగా అలసిపోయే అవకాశం ఉందన్నారు. తలరాత బాగుండాలంటే చేతిరాత బాగుండాలని అన్నారు.







# జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్ కార్డుల పంపిణీ

- సీఎం సమీక్షలో కీలక ఆదేశాలు

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్రవ్యాప్తంగా జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరగనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఎరువుల లభ్యత, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సోమవారం సీఎం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర మంత్రులు, అధికారులు, సలహాదారులు పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గత ఏడాది ఖమ్మం జిల్లాలో తక్కువ సమయంలో భారీ వర్షపాతం నమోదైన ఉదాహరణను గుర్తు చేస్తూ, ఈసారి కూడా అటువంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**వర్షా లు,వ్యాధులు,విపత్తులపై అప్రమత్తత**

వర్షాలతో ఏర్పడే పరిస్థితుల్లో ప్రజల ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, పిడుగుపాటుకు బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించేందుకు పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని,సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**ఎరువులు, విత్తనాల లభ్యతపై కట్టుదిట్టు చర్యలు**

రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా, ఇతర ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని,ఎరువుల అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాల విక్రయాలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు.ప్రతి ఎరువుల దుకాణం వద్ద స్టాక్ వివరాలు బహిరంగ నోటీసుపై ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశించారు.

**రేషన్ కార్డుల పంపిణీ,నిరంతర ప్రక్రియగా కొనసాగింపు**

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులు మంజూరయ్యాయని, వీటి ద్వారా 31 లక్షల మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు.ప్రస్తుతం మొత్తం 96.96 లక్షల కార్డుల ద్వారా 3.10 కోట్ల మందికి రేషన్ లబ్ధి అందుతోంది.సన్న బియ్యం సరఫరా వల్ల ప్రజల్లో రేషన్ కార్డులపై ఆసక్తి పెరిగిందని పేర్కొన్నారు.

**ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో పంపిణీ**

రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తప్పనిసరిగా పాల్గొనాలని ,ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒకచోట జిల్లా ఇంచార్జ్ మంత్రి పాల్గొనేలా కలెక్టర్ సమన్వయం చేయాలని పేర్కొన్నారు.

వర్షపు నీరు నిల్వ కాకుండా తగు చర్యలు, ఆయిల్ బాల్స్ వాడకాన్ని ప్రోత్సహించడం, డ్రైనేజీల శుభ్రత వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.

ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, వైద్య సిబ్బంది హాజరు పట్ల నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అత్యవసర ఖర్చుల నిమిత్తం కలెక్టర్లకు నిధులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

ఈ సమీక్షలో హనుమకొండ జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీఏఓ రవీందర్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# మెగా జాబ్ మేళ సద్వినియోగం చేసుకోండి

- డేర్ విద్యాసంస్థల చైర్మన్ దారిపల్లి కిరణ్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాల వారి సహకారం తో సమర్ధనం ట్రస్ట్ - హైదరాబాద్. ఖమ్మం జిల్లా లోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం సమర్ధనం ట్రస్ట్ హైదరాబాద్ వారు డేటా ఎంట్రీ, బీపీఓ, రిటైల్, హాస్పిటాలిటీ, ఆటోమోటివ్, వైద్య ఎలక్ట్రికల్ మరియు బ్యూటీ రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళ తేదీ 23 వ జులై 2025 స్థానిక దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాల లో నిర్వహించబడును. సమయం ఉదయం 9.00 గం. నుండి 3వరకు

18 వ సం. నుండి 35 వ సం లోపు వయస్సు గల 10 వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఒకేషనల్, ఐటిఐ, డిప్లొమా , ఇంజినీరింగ్, బి ఫార్మాసి చదివిన నిరుద్యగులు అభ్యర్థులు ఆకాశం వినియోగించగలరు. జాబ్ మేళ కి వచ్చే అభ్యర్థులు తమ వెంట బయో డేటా ఫారం, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ తో హాజరు కాగలరు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యగ యువతీ యువకులు అందరు వినియోగించుకోగలరు. మరిన్ని వివరాలకు క్రింది ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరు అని డేర్ విద్యాసంస్థల చైర్మన్ దరిపల్లి కిరణ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



# చేబ్రోలు వీరమణి మృతి పట్ల సంతాపం తెలిపిన కూనంనేని

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

చింతకాని మండలం పొద్దుటూరు గ్రామనికి చెందిన సిపిఐ నాయకులు చేబ్రోలు ఇంద్రసేన సతీమణి చేబ్రోలు వీరమణి మృతి పట్ల సంతాపం తెలిపిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఏపూరి రవీంద్రబాబు కొండపర్తి గోవిందరావు ఎర్ర బాబు ఏనుగు వెంకటేశ్వరావు పోటు కళావతి సీతామాలక్ష్మి పావులూరి మల్లికార్జున్ శివరామకృష్ణ ఇటికాల రామకృష్ణ సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు వెంకటనరసయ్య తదితరులు ఉన్నారు




# మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్

- ట్రయిల్ రన్ ఈనెల 24 న నిర్వహించాలి
- మంత్రి తుమ్మల

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:


రఘునాధపాలెం మండలంలోని చెరువులన్నింటిని ఈనెల 24వ తేదీ న ట్రయల్ రన్ వేసి చెరువులు నీటితో నింపే లా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న పనులన్నీటిని సత్వరమే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సబ్ స్టేషన్ నిర్మాణం కోసం యన్.పి.డి.సి.యల్

సిఎండి వరుణ్ రెడ్డి తో మాట్లాడి తక్షణమే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ అడ్వైజర్ శ్రీ పెంటా రెడ్డి గారితో మాట్లాడి ఈనెల 24వ తారీఖున ట్రయిల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పై కోడుమూరు గ్రామం వద్ద ఉన్న హైటెన్షన్ లైన్ ను తక్షణమే మార్చేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో డైరెక్టర్ లతా వినోదకు సూచించారు. నేషనల్ హైవే మరియు ట్రాన్స్కో అధికారులు సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా వెలుగుమట్ల అర్బన్ పార్క్ లో వన్యప్రాణులకు త్రాగు నీరు మరియు నర్సరీ మొక్కలకు నీటిని అందించేందుకు కొదమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్క్ వరకు పైప్ లైన్లు వేసేలా చర్యలు తీసుకోవాలని. ఆ డిజైన్లను డీఎఫ్ఓ తో సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు.

ఖమ్మం నగర సుందరీకరణ కోసం రహదారులను విస్తరించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చుట్టూ రహదారుల విస్తరణను వ్యక్తిగతంగా పరిశీలించి ఎవరినైనా గృహాలు కోల్పోతే వారికి డబల్ బెడ్రూం ఇల్లులు కానీ ఇందిరమ్మ ఇల్లు కానీ కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు అదేవిధంగా మాస్టర్ ప్లాన్ ను సత్వరమే ఆమోదం పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరినారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# రేషన్ కార్డులు నిరుపేద కుటుంబాలకు సంజీవని లాంటిది...

- **పదేళ్ల నిరీక్షణకి ప్రజా ప్రభుత్వం చరమగీతం..**
- **నాడు రేషన్ కార్డులు ఇచ్చింది నేడు మళ్లీ ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం...**
- **ఎమ్మెల్యేగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది.**
- **రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే నాయిని.**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

పదేళ్ల విరామం అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2469 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందజేసే కార్యక్రమం హనుమకొండ గోకుల్ నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రేషన్ కార్డులు నిరుపేదలకు సంజీవని లాంటి వి. నాడు ఇచ్చినట్లు నేడు మళ్లీ ఇచ్చే ప్రభుత్వం కాంగ్రెస్‌దే. ప్రజా ప్రభుత్వంగా పరిగణించబడే ప్రభుత్వం పదేళ్ల నిరీక్షణకు చరమగీతం పలికింది" అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 104, 108, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అట్టడుగు వర్గాలకు భరోసాగా నిలిచినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు ప్రయాణం, రుణ మాఫీ, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాల ద్వారా ప్రజల బాగోగుల కోసం కృషి చేస్తోందని తెలిపారు.

ప్రతిపక్షాల విమర్శలపై స్పందిస్తూ, "గతంలో ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వని అసమర్థులు నేడు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు. శవాలపై పేలాలు పెట్టి రాజకీయం చేసే పార్టీలకు ఈ అభివృద్ధి చెంపపెట్టులా ఉంటుంది" అని అన్నారు.

కోచ్ ఫ్యాక్టరీ కోసం అప్పట్లో భూములు కేటాయించడం, నియోజకవర్గానికి అందిన పథకాలు కార్యకర్తలు, ఎమ్మెల్యే బంధువులకు మాత్రమే పరిమితం చేసిన తీరును ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. త్వరలో వరంగల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయాన్ని వెల్లడించారు.పుట్టిన రోజు అయినప్పటికీ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేయకుండా, నిర్దేశిత పథకాన్ని కొనసాగించటం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# టి యూ డబ్ల్యూ జె (ఐజేయు) జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలి

- **జిల్లా యూనియన్ సభ్యులు కొంతం ప్రశాంత్**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం నుండి ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా యూనియన్ కు సంబంధించిన సీనియర్ సభ్యులు కొంతం ప్రశాంత్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టి యు డబ్ల్యూ జే (ఐజేయు) ఆధ్వర్యంలో తేదీ 23 సమావేశానికి పాత్రికేయులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యూనియన్ కు సంబంధించిన అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూరంపల్లి గోపాల్, కె.వెంకట్ గౌడ్, గడ్డమిది నాగరాజ్, బండి రాజు, ఎస్.అశోక్ కుమార్, బాజా శేఖర్, నక్క కృష్ణయాదవ్, మన్నెం తదితరులు పాల్గొన్నారు.



# తమిళనాడు సీఎం స్టాలిన్‌కు అస్వస్థత

తమిళనాడు సీఎం స్టాలిన్ అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని అపోలో హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ప్రస్తుతం ఆయనకు ఇంకొన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అపోలో వైద్యులు తెలిపారు. అయితే ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో స్టాలిన్ ఇబ్బంది పడినట్టు తెలుస్తోంది. ఆయనకు తల తిరుగుతున్నట్లు అనిపించడంతో రెగ్యులర్ చెకప్‌లో భాగంగా వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని అపోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వ్యక్తిగత వైద్యుడి సలహా మేరకు ఆయన అక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. రెగ్యులర్ చెకప్‌లో భాగంగా ఆయన మరో రెండ్రోజుల పాటు హాస్పిటల్‌లోనే ఉండనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సీఎం స్టాలిన్ సోదరుడు, నటుడు ఎంకే ముత్తు శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 77 ఏళ్ల ముత్తు చెన్నయ్‌లోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తమిళ సినీరంగంలో నటుడిగా, గాయకుడిగా ఇయన ఎంతగానే పేరు తెచ్చుకున్నారు. కొన్ని రోజుల తర్వాత ఆయన సినీ పరిశ్రమను వదిలేశాడు. ఆయన మరణంపై సీఎం స్టాలిన్, ఆయన సోదరి కనిమొళి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తమకు తీవ్రంగా కలిచి వేసినట్టు వారు తెలిపారు.





# సంక్రాంతి కల్లా ఆధునికీకరణ పనులు పూర్తి చేసి, మార్కెట్ యార్డ్ ను అందుబాటులోకి తేవాలి...

- **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

డిసెంబర్ లోగా మార్కెట్ యార్డ్ ఆధునికీకరణ పనులు పూర్తిచేసి, సంక్రాంతి కల్లా అందుబాటులోకి తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రివర్యులు స్థానిక గ్రెయిన్ మార్కెట్ ఆధునికీకరణ పనులను సోమవారం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఊరి బయట ఉన్న మార్కెట్, ఊరి మధ్యలోకి వచ్చిందని, రఘునాథ పాలెం మండలంలో 100 ఎకరాల్లో నిర్మించాలని తలచానని తెలిపారు. 20 డివిజన్ల ప్రజలు మిర్చి ఘాటు తో ఇబ్బంది పడేవారని,


అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సీఎం ను ఒప్పించి గతంలో అనుమతి పొందానన్నారు. మద్దులపల్లి మార్కెట్ ను కూడ అందుబాటులోకి తెచ్చానని తెలిపారు. ఈ మార్కెట్ ను అంతర్జాతీయ స్థాయిలో మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దాలని మంత్రి అన్నారు. మన మార్కెట్ ను దేశంలోని అన్ని మార్కెట్లు దిక్సూచి గా తీసుకోవాలన్నారు.

రైతులకు ఎలాంటి నష్టం జరగొద్దని, అవన్నీ దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశానని తెలిపారు. ఎగిలిటి కంపెనీ నమ్మకమైన కంపెనీ అని, డిసెంబర్ చివరి వరకు గడువు ఇచ్చినట్లు, ఆలోగా పనులన్నీ పూర్తి అవ్వాలన్నారు. సంక్రాంతి పండుగ రోజు రైతులు పంట ఉత్పత్తులు తెచ్చి వ్యాపారం చేసుకునేలా ప్లాన్ చేస్తున్నామన్నారు.

ఇతర రాష్ట్రాలు, దేశాల వారీగా వచ్చే వ్యాపారులు ఎగుమతి, దిగుమతి కూడా ఇక్కడే జరిగేట్లు చర్యలు చేపడుతున్నామన్నారు. పనులపై అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలన్నారు. రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దని తెలిపారు. పండించిన పంటకు భద్రత కల్పించాలన్నారు.

5 నెలల గడువులోగా మోడల్ మార్కెట్ ను అందివ్వాలని మంత్రి తెలిపారు. మార్కెట్ కు వచ్చే భారీ వాహనాల వల్ల రోడ్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అందుకుగాను ప్రజల గుడిసెలు తొలగించి, వారికి పునరావాసం కల్పించేందుకు స్థలం చూసి ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ వెంకటేశ్వర రావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# గల్ఫ్ జనసేన యూఏఈ నేతల ఆర్థిక సాయం

గల్ఫ్ జనసేన యూఏఈ నాయకులు తమ పెద్ద మనసును చాటుకున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఓ వ్యక్తికి వైద్యం కోసం రూ. లక్షను ఆర్థిక సాయంగా అందించారు.%జ%పి. గన్నవరం నియోజకవర్గం, అయినవిల్లి మండలం, అయినవిల్లి గ్రామం మెట్ల కాలనీకి చెందిన అద్దంకి నాగేశ్వరరావు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయం జనసేన నాయకులు అల్లాడ రవి ద్వారా తెలిసిన గల్ఫ్ జనసేన యూఏఈ ఇన్‌చార్జి కేసరి త్రిమూర్తులు, మొగళ్ల చంద్రశేఖర్ నేతృత్వంలోని బృందం ఆపన్న హస్తం అందించింది. జననాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సేవా దృక్పథాన్ని అనుసరిస్తూ ఆర్థిక సాయం అందించింది. గల్ఫ్ జనసేన యూఏఈ ఎగ్జిక్యూటివ్ టీం ఆధ్వర్యంలో పి.గన్నవరం జనసేన పార్టీ కార్యాలయంలో, ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా బాధితుడికి రూ.100000 అందజేశారు. గల్ఫ్ జనసేన యూఏఈ బృందం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే అభినందిస్తూ ప్రశంసలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ సిరిగినెడి వెంకటేశ్వరరావు, గంగలకుర్రు అగ్రహారం సొసైటీ చైర్మన్ అల్లాడ రవి, పి.గన్నవరం నియోజకవర్గ జనసేన నాయకులు, పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని పి. గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించడానికి గల్ఫ్ జనసేన యూఏఈ బృందం గర్వంగా భావిస్తోందని, భవిష్యత్తులో ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నేతలు తెలిపారు.

# మొత్తానికి మరమ్మతులు విజయవంతం

- **ఈ నెల 14 నుంచి కేరళలో చిక్కుకుపోయిన బ్రిటీష్ యుద్ధ విమానం**
- **మరమ్మతుల కోసం వచ్చిన 25 మంది ఇంజినీర్ల బృందం**
- **ఈ ఉదయం హ్యాంగర్ నుంచి విమానం బయటకు**
- **యూకేకు బయలుదేరడానికి ముందు ట్రయల్ ఫ్లైట్ నిర్వహణ**

ఈ నెల 14 నుంచి కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్ 35బి స్టెల్త్ యుద్ధ విమానం హైడ్రాలిక్ సిస్టమ్ లోపాన్ని ఎట్టకేలకు సరిచేశారు. ఈ విమానం యూకేకు బయలుదేరడానికి ముందు ట్రయల్ ఫ్లైట్ నిర్వహించనున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రాయల్ నేవీకి చెందిన ప్రముఖ విమాన వాహక నౌక హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ నుంచి విమానాన్ని డైవర్ట్ చేసి ఈ నెల 14న కేరళలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం ఖరీదు దాదాపు 115 మిలియన్ డాలర్లు. ల్యాండిరగ్ గేర్, బ్రేక్‌లు, ఫ్లైట్ కంట్రోల్ సర్ఫేస్‌ల వంటి కీలక భాగాలను ప్రభావితం చేసే హైడ్రాలిక్ వైఫల్యం కారణంగా గత నెల రోజులుగా ఇది తిరువనంతపురంలోనే హ్యాంగర్‌కు ఉండిపోయింది. ఈ నెల 6న బ్రిటిష్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ 400ఎం అట్లాస్‌లో వచ్చిన 25 మంది బ్రిటిష్ ఇంజనీర్ల బృందం ఎయిర్ ఇండియా మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) హ్యాంగర్‌లో ఈ విమానానికి మరమ్మతులు ప్రారంభించింది. ఈ ఉదయం ఎఫ్35బి విమానాన్ని హ్యాంగర్ నుంచి బయటకు తీసుకొచ్చారు, మరమ్మతులు విజయవంతం కావడంతో యూకేకు తిరిగి వెళ్లేముందు నేడు కానీ, రేపు కానీ ట్రయల్ ఫ్లైట్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అనంతరం ఇది యూకేకు వెళ్లనుంది.



# ఒక్కసారి డిపాజిట్ చేస్తే ప్రతినెలా రూ.20 వేల ఆదాయం..!

పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ఇది మంచి వడ్డీ రేటును ఇవ్వడమే కాకుండా పన్ను ఆదా, సాధారణ ఆదాయాన్ని కూడా నిర్ధారిస్తుంది. పదవీ విరమణ తర్వాత ఎటువంటి ప్రమాదం లేకుండా తమ పొదుపుపై ప్రతి నెలా స్థిర ఆదాయాన్ని కోరుకునే సీనియర్ సిటిజన్ల కోసం ఈ పథకం ప్రత్యేకంగా రూపొందించారు. పదవీ విరమణ తర్వాత ప్రతి నెలా మీకు స్థిర ఆదాయం ఉంటే జీవితం మరింత ప్రశాంతంగా కనిపిస్తుంది. అలాంటి సమయాల్లో సురక్షితమైన పెట్టుబడి, హామీ ఇవ్వబడిన రాబడిని అందించే పథకాలు చాలా ముఖ్యమైనవి అవుతాయి. పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ప్రభుత్వ పథకం. ఇది మంచి వడ్డీ రేటును ఇవ్వడమే కాకుండా పన్ను ఆదా, సాధారణ ఆదాయాన్ని కూడా నిర్ధారిస్తుంది. పదవీ విరమణ తర్వాత ఎటువంటి ప్రమాదం లేకుండా తమ పొదుపుపై ప్రతి నెలా స్థిర ఆదాయాన్ని కోరుకునే సీనియర్ సిటిజన్ల కోసం ఈ పథకం ప్రత్యేకంగా రూపొందించారు.

పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ అంటే ఏమిటి..?

పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్. ఇది సురక్షితమైన పొదుపు పథకం. దీనిలో ప్రస్తుతం 8.2% వార్షిక వడ్డీ వస్తుంది. ఇది చాలా బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే ఎక్కువ. మీరు దీనిలో కేవలం రూ. 1,000 తో పెట్టుబడి పెట్టడం ప్రారంభించవచ్చు.




అలాగే గరిష్టంగా రూ. 30 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు.

ఎవరు పెట్టుబడి పెట్టవచ్చు..? : 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఏ వ్యక్తి అయినా ఈ పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు.

ఒక ప్రభుత్వ ఉద్యోగి 55, 60 సంవత్సరాల మధ్య స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుంటే, అతను కూడా అర్హులే. పదవీ విరమణ చేసిన రక్షణ సిబ్బంది 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు వారు పెట్టుబడి పెట్టవచ్చు.

మీరు మీ భార్య/భర్తతో కలిసి ఉమ్మడి ఖాతాను కూడా తెరవవచ్చు.

మీరు ప్రతి నెలా ఎంత సంపాదిస్తారు..? : ఈ పథకంలో ఒక వ్యక్తి ఒకేసారి రూ.30 లక్షలు పెట్టుబడి పెడితే, అతనికి ప్రతి సంవత్సరం దాదాపు రూ.2.46 లక్షల వడ్డీ లభిస్తుంది. ఈ డబ్బు ప్రతి మూడు నెలలకు ఖాతాలోకి వస్తుంది. అంటే నెలకు దాదాపు రూ.20,500 క్రమం తప్పకుండా ఆదాయం లభిస్తుంది. మీరు రూ.20 లక్షలు పెట్టుబడి పెడితే, వడ్డీతో సహా మొత్తం రాబడి ఐదు సంవత్సరాలలో దాదాపు రూ.28.2 లక్షలు ఉంటుంది. ఈ కాలంలో ప్రతి మూడు నెలలకు దాదాపు రూ.41,000 అంటే నెలకు రూ.13,666 ఆదాయం వస్తుంది.

పన్ను ఉపశమనం : %బాజూ% ద్వారా, మీరు సెక్షన్ 80%జ% కింద సంవత్సరానికి రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. మెచ్యూరిటీ సమయం, నియమాలు : ఈ పథకం 5 సంవత్సరాలు. దీనిని 3 సంవత్సరాలకు పొడిగించవచ్చు. మీరు ఒక సంవత్సరం ముందు ఖాతాను మూసివేస్తే అప్పుడు వడ్డీ అందించరు. 2 నుండి 5 సంవత్సరాల మధ్య మూసివేస్తే, 1% వడ్డీ తగ్గిస్తారు. ప్రభుత్వ హామీ, మంచి వడ్డీ రేట్లు, పన్ను ఆదా, స్థిర ఆదాయం %బాజూ% ను పదవీ విరమణ చేసిన వారికి నమ్మకమైన, లాభదాయకమైనదిగా పరిగణించవచ్చు. పదవీ విరమణ తర్వాత మీరు స్థిరమైన ఆదాయాన్ని కోరుకుంటే ఇది మీకు ఉత్తమ ఎంపిక.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# బంగ్లాదేశ్‌లో పాఠశాలపై కూలిన యుద్ధ విమానం

- పైలట్‌తో పాటు ఒక విద్యార్థి మృతి
- మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆందోళన
- ఎఫ్-7బీజీఐ ఎయిర్‌క్రాఫ్ట్ కూలినట్లు బంగ్లా ఆర్మీ వెల్లడి



బంగ్లాదేశ్‌లో విషాదకర విమాన ప్రమాదం సంభవించింది. బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ యుద్ధ విమానం స్థానిక మైల్‌స్టోన్ పాఠశాలపై కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పైలట్‌తో పాటు ఒక విద్యార్థి మృతి చెందగా, పలువురికి గాయాలైనట్లు సమాచారం. పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలోనే ఈ ప్రమాదం జరగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. యుద్ధ విమానం కూలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఎఫ్ 7బీజీఐ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయినట్లు బంగ్లాదేశ్ ఆర్మీ అధికార ప్రతినిధి ధృవీకరించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎంతమంది మరణించారనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.





# ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- రాజకీయ పోరాటం చేయొద్దని హితవు
- అది అధికార దుర్వినియోగమేనని ఆగ్రహం
- కర్ణాటక హైకోర్టు తీర్పుపై పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం



సూర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) భూముల అక్రమ కేటాయింపుల కేసులో దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి కర్ణాటక హైకోర్టు తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్ ను పరిశీలించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ల ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భూముల అక్రమ కేటాయింపుల వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, రాష్ట్ర మంత్రి సురేశ్ లకు జారీ చేసిన సమన్లను హైకోర్టు కొట్టివేసిందని ఈడీ గుర్తుచేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్ ను పరిశీలిస్తూ.. ఈ వ్యవహారంలో ఈడీ రాజకీయ పోరాటం చేస్తోందని సుప్రీం ధర్మాసనం విమర్శించింది. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. పిటిషన్ పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టం చేసింది. ఈడీని రాజకీయ పోరాటాలకు ఎందుకు ఉపయోగిస్తున్నారంటూ న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ కేసు విచారణకు స్వీకరించడంపై సీజేఐ బెంచ్ అయిష్టత వ్యక్తం చేసింది.



# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం..

- విపక్షాల వాయిదా తీర్మానాలు
- విమాన ప్రమాదంపై పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి కీలక ప్రకటన!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశమయ్యాయి. ఈ సమావేశాల సందర్భంగా విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బీహార్ ఓటర్ జాబితాలపై తీర్మానాలు ఇచ్చారు. అదేవిధంగా ఇంటెలిజెన్స్ వైఫల్యాలు, టెర్రరిస్ట్‌లను ఇంత వరకూ అరెస్ట్ చేయకపోవడంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమయ్యాయి. దీంతో సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఇండియా కూటమి నేతృత్వంలోని విపక్షాలు ఇప్పటికే వ్యూహరచన చేశాయి. అధికార కూటమి కూడా ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధంగా ఉంది. నేటి నుంచి ఆగస్టు 21 వరకు దాదాపు 21 రోజులపాటు జరుగనున్న ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలున్నాయి. మరోవైపు ఈ సమావేశాల్లో ఏడు పెండిరగ్ బిల్లులతోపాటు 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు వంటివి ఇందులో ఉన్నాయి. వీటితో పాటు ఇన్‌కం ట్యాక్స్2025 బిల్లును కూడా కేంద్రం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించే తీర్మానం కూడా ఈ సమావేశాలలోనే పార్లమెంటు ముందుకు రానుంది.

**విమాన ప్రమాదంపై పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి కీలక ప్రకటన!**

జూన్ 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై సోమవారం రాజ్యసభలో వీడీవేడీగా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఘటనపై కేంద్ర పౌరవిమానాయాన శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద ఘటనపై ఇప్పటికి కేవలం ప్రాథమిక నివేదిక మాత్రమే వచ్చిందని.. దాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇన్వెస్ట్‌గేషన్ టీమ్ నుంచి తుది నివేదిక వచ్చన తర్వాత ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన చెప్పారు. అనవసరంగా ఈ ఘటనపై కొన్ని విదేశీ మీడియాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ఆయన రోపించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు తమ సొంత అభిప్రాయాలు చెప్పడం సరికాదని కేంద్రమంత్రి మండిపడ్డారు. అంతే కాకుండా ప్రమాద ఘటనపై నిబంధనల ప్రకారమే దర్యాప్తు జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రొటోకాల్ ప్రకారమే దర్యాప్తు కొనసాగుతున్నట్టు తెలిపారు. ప్రాథమిక నివేదిక ప్రకారం.. బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నా డేటాను రిట్రీవ్ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ ప్రమాదం తర్వాత స్వదేశంలో బ్లాక్‌బాక్స్‌ను తొలిసారిగా డీకోడ్ చేయగలిగామని కేంద్రమంత్రి వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరకుండా తగిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి తెలిపారు.

# ప్రపంచం దృష్టి మొత్తం మేడిన్ ఇండియా ఆయుధాలపైనే

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



ఆపరేషన్ సిందూర్‌తో మన దేశ సైనికుల సత్తా ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మీడియాతో మాట్లాడారు. వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు వందశాతం లక్ష్యాలను సాధించినట్లు చెప్పారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు గుర్తు చేశారు. ఈ ఆపరేషన్‌తో మన సైనిక సామర్థ్యం, గొప్పతనం ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతోందన్నారు. ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం గురించి మన దేశ ఎంపీలు ప్రపంచంలోని వివిధ దేశాల్లో పర్యటించి వివరించారని మోదీ గుర్తు చేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయంగా ఎండగట్టినట్లు చెప్పారు. తుపాకులు, బాంబులు ఉన్నా మన రాజ్యాంగం ముందు నిలబడలేకపోయాయని స్పష్టంచేశారు. ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' విజయంపై వేడుక చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయ పార్టీలూ, ప్రతీ ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి రావడంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌లో మన జాతీయ జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం అని కొనియాడారు. ఇక రైతుల జీవనోపాధి, దేశ ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉందన్నారు.



# రూ.20 ఇవ్వలేదని దారుణం..

- తల్లిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు




రోజురోజుకు యువత చెడిపోతున్నారు. మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కొందరు అక్రమ రవాణా దారులు మాత్రం పోలీసులు, అధికారుల కళ్లు గప్పి వాటిన గుట్టుగా విక్రయిస్తున్నారు. ఇలా అడ్డదారిలో దొరికే డ్రగ్స్‌ను వాడుతూ వాటికి బానిసలవుతున్న యువత తమ జీవితాలను పాడుచేసుకోవడంతో పాటు ఇతరుల జీవితాలను కూడా ఆగం చేస్తున్నారు. తాజాగా హార్యానా రాష్ట్రంలోని నుహ్ జిల్లాలో ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. డ్రగ్స్‌కు బానిసైన ఒక కొడుకు రూ.20 ఇవ్వలేదని కోపంలో గొడ్డలితో తల్లిని అతి కిరాతకంగా నరికి హత్య చేశారు. ఘటనపై కేసు నమెదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసలు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ సంఘటన శనివారం నుహ్ జిల్లాలో జరిగింది. జైసింగ్‌పూర్ గ్రామానికి చెందిన ముబారక్, రజియా దంపతులకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. అయితే నాలుగేళ్ల క్రితం రజియా భర్త మరణించాడు. దీంతో రజియా కుమారుడు జింషెడ్ మాదకద్రవ్యాలకు బాలనిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రూ.20 ఇవ్వాలని తల్లి రజియాను అడిగాడు. అందుకు తల్లి రజియా నిరాకరించడంతో ఆగ్రహించిన కుమారుడు జింషెడ్.. ఇంట్లోని ఉన్న గొడ్డలి తీసుకొని తల్లిపై దాడికి పాల్పడ్డాడు. కుమారుడి దాడిలో తీవ్రంగా గాయపడిన రజియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. అయితే తన తల్లిని చంపిన తర్వాత, జంషెడ్ రాత్రంతా అదే ఇంట్లో పడుకున్నాడు. ఉదయం ఇంట్లో అతన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు జింషెడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తల్లి రజియా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సభలో నాకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదు

- నేడు ప్రారంభమైన పార్లమెంటు వర్షా కాల సమావేశాలు
- ప్రతిపక్షాల హక్కులను కాలరాస్తున్నారన్న రాహుల్
- ఎన్డీయే ప్రభుత్వం వారికి అనుకూలమైన విధానాలను సృష్టించుకుంటోందని మండిపాటు



కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతనైన తనకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. సభలో అధికార పక్ష సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలోని మంత్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి... తనకు మాత్రం తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ... మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమేనని రాహుల్ అన్నారు. లోక్ సభలో చర్చ ప్రారంభమైన వెంటనే ప్రధాని మోదీ వెళ్లిపోయారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అన్ని విషయల్లో వారికి అనుకూలమైన కొత్త విధానాలను సృష్టించుకుంటోందని విమర్శించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఆపరేషన్ సిందూర్ తో పాటు, పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్ సభలో విపక్ష పార్టీల సభ్యులు ఆందోళనకు దిగారు. విపక్ష పార్టీలు ఆందోళనను విరమించాలని లోక్ సభ స్పీకర్ పలుమార్లు విన్నవించినప్పటికీ వారు పట్టించుకోలేదు. దీంతో, స్పీకర్ సభను కాసేపు వాయిదా వేశారు.ాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమేనని రాహుల్ అన్నారు. లోక్ సభలో చర్చ ప్రారంభమైన వెంటనే ప్రధాని మోదీ వెళ్లిపోయారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అన్ని విషయల్లో వారికి అనుకూలమైన కొత్త విధానాలను సృష్టించుకుంటోందని విమర్శించారు.

## పహల్గాం ఉగ్రదాడిపై చర్చకు విపక్షాల పట్టు

పహల్గాం ఉగ్రదాడి ఘటన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ను కుదిపేస్తోంది. ఈ ఘటనపై చర్చించాలంటూ విపక్షాలు లోక్‌సభలో నిరసనకు దిగారు. దీంతో దిగువ సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ ఎంత చెప్పినా సభ్యులు వినకపోవడంతో లోక్‌సభ ను వాయిదా వేయాల్సి వచ్చింది. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశామయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమయ్యాయి. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలంటూ పట్టుబట్టారు. అయితే, ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానాలపై చర్చ చేపడదామని స్పీకర్ ఓంబిర్లా నచ్చజెప్పారు. అయినా ఎంపీలు వినిపించుకోలేదు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సాంకేతిక సమస్యతో ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తికి బ్రేక్

- **అమ్మోనియా పైప్‌లైన్ లీక్‌తో మళ్లీ మూత**
- **25 రోజులవరకు యూరియా తయారీ డౌటే**
- **జెడ్ఎల్‌డీ లేకపోవడంతోనే తరచూ సమస్యలు**
- **ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల లోటు**




మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుంది పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) పరిస్థితి. అసలే దేశంలో యూరియా కొరత వేధిస్తున్న క్రమంలో తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాల్లో యూరియా సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మళ్లీ మూతపడిరది. ఈ నెల 16న అమ్మోనియా కనెక్టర్ పైప్‌లైన్ లీక్ కావడంతో ప్లాంట్‌ను షట్ డౌన్ చేశారు. మూడు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నప్పటికీ ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. తిరిగి ప్లాంట్ అందుబాటులోకి రావడానికి కనీసం 20 రోజుల వరకూ సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 202526లో కేంద్ర, ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖ 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, ప్లాంట్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో ఈ ఏడాది మే 6న ప్లాంట్ షట్ డౌన్ చేసి, తిరిగి జూన్ 13న పునరుద్ధరించారు. జూన్‌లో 46,347.57 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి జరిగింది. కర్మాగారంలో ఉత్పత్తి అయిన యూరియాలో ఏప్రిల్, జూన్ నెలలకు గాను రాష్ట్రానికి 30 శాతం మాత్రమే కేటాయించారు. మరింత యూరియా అవసరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఇటీవలే కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ.. ప్రస్తుత షట్ డౌన్ కారణంగా అసలుకే మోసం వచ్చింది. దాదాపు 25 రోజుల వరకూ ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉండటంతో యూరియా మరింత కొరత ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జెడ్ఎల్‌డీ లేకపోవడం వల్లే.. : ఆర్ఎఫ్‌సీఎల్‌ను 2021లో రూ. 6,500 కోట్ల వ్యయంతో నిర్మించారు. మొత్తం ఈ ప్లాంట్ ద్వారా రోజుకు 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేయడమే లక్ష్యం కాగా, తరచూ సాంకేతిక సమస్యలు వెంటాడుతుండటంతో లక్ష్యాన్ని అందుకోలేకపోతున్నారు. ప్లాంట్ నిర్మించిన సమయంలోనే మిషనరీతో పాటు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ)ని సైతం నిర్మించాల్సి ఉండగా, దీనిని నిర్లక్ష్యం చేశారు. ఈ క్రమంలోనే తరచూ సమస్యలు అధికం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ జెడ్ఎల్‌డీ నిర్మాణానికి దాదాపుగా రూ.150 కోట్ల దాకా ఖర్చయ్యే అవకాశం ఉండగా, యాజమాన్యం వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తున్నది. దీనికి తోడు గ్యాస్ లీకేజీలు, ఎల్‌బో లీకేజీలు, అమ్మోనియా లీకేజీలతో షట్ డౌన్‌లు జరుగుతున్నాయి. దాదాపుగా 25 రోజుల వరకూ ఈ షట్ డౌన్ కొనసాగే అవకాశం ఉండటంతో 96,250 మెట్రిక్ టన్నుల యూరియా, 55 వేల మెట్రిక్ టన్నుల వరకు అమ్మోనియా ఉత్పత్తికి ఆటంకం కలిగే ప్రమాదం ఉన్నది. వ్యవసాయ అవసరాల సమయంలో ఉత్పత్తికి బ్రేకులు పడటంతో తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్రాలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది.

రాష్ట్రానికి తగ్గిన కేటాయింపులు.. : గత నెలలో తెలంగాణకు 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, అందులో సగం మాత్రమే 15,924.87 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. ఒక వైపు ఉత్పత్తిలో ఇబ్బందులతో పాటు తెలంగాణకు ఇచ్చే యూరియా కోటాలో కేంద్ర ప్రభుత్వం తగ్గింపులు చేయడంతో కోటా తగ్గింది. ఈ విషయమై కేంద్ర రసాయనాల శాఖ మంత్రికి వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందికర పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ కావడం పట్ల రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలతో ఈ ఏడాది కేటాయింపులకు తగ్గట్టుగా యూరియాను సరఫరా చేయలేకపోయారు. ఏడు రాష్ట్రాలకు 3,30,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 2,40,679మెట్రిక్ టన్నులు మాత్రమే పంపించారు. ఇంకా దాదాపుగా లక్ష మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉంది.




## రైతుల ఖాతాల్లో జూలై 25న

# పీఎం కిసాన్ నిధులు..?

పీఎం కిసాన్ పథకం కింద ప్రతి సంవత్సరం రైతుల బ్యాంకు ఖాతాలో రూ. 6,000 జమ చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఈ డబ్బు ప్రతి 4 నెలలకు రూ. 2,000 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుంది. ఈ పథకం..

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద ఇప్పటివరకు రైతుల బ్యాంకు ఖాతాలకు 19 విడతల డబ్బు జమ కాగా, 20వ విడత ఎప్పుడు చెల్లిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రధానమంత్రి కిసాన్ 20వ విడత జూలై 18, 2025 నుండి రైతుల బ్యాంకు ఖాతాలకు రూ. 2,000 జమ అవుతుందని ముందుగా భావించినప్పటికీ అధికారికంగా ఎలాంటి నిధులు విడుదల చేయలేదు కేంద్రం. ఈ పీఎం కిసాన్ పథకం కింద ప్రతి సంవత్సరం రైతుల బ్యాంకు ఖాతాలో రూ. 6,000 జమ చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఈ డబ్బు ప్రతి 4 నెలలకు రూ. 2,000 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 విడతలుగా రూ. 2,000 రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేసింది. ఇప్పుడు 20వ విడత రూ. 2,000 ఎప్పుడు జమ అవుతుందో అని రైతులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

20వ విడతకు సంబంధించి సమాచారం : రైతులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చెల్లింపు పీఎం కిసాన్ 20వ విడతకు సంబంధించి సమాచారం అందినట్లు తెలుస్తోంది. జూలై 25, 2025న విడుదల కావచ్చని సమాచారం. అయితే దీనిపై కేంద్రం మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ సంవత్సరం దాదాపు 2.5 లక్షల కొత్త కిసాన్ కార్డులు రైతులకు జారీ చేయనున్నట్లు సమాచారం. అయితే జూలై 25వ తేదీన ఈ విడత డబ్బులు మోడీ విడుదల చేయనున్నట్లు సమాచారం అందుతోంది.

మీకు ఇంకా ప్రధానమంత్రి కిసాన్ డబ్బు అందలేదా..? : మీరు ఇంకా మీ 20వ విడత %వాపీ% కిసాన్‌ను అందుకోకపోతే, మీరు %వ ఖ్‌జ% చేసి ఉండకపోవచ్చు. మీ 20వ విడత పీఎం కిసాన్‌ను పొందడానికి %జు ఖ్‌జ% తప్పనిసరి. అందుకే మీ %ఖ్‌జ%ని ఆన్‌లైన్‌లో చాలా త్వరగా పూర్తి చేయడం ద్వారా మీరు పీఎం కిసాన్ 20వ విడత పొందుతారని గమనించాలి.

# హోండా నుంచి ఎలక్ట్రిక్ బైక్..!




హోండా పెట్రోల్ ఇంజిన్ స్థానంలో ఎలక్ట్రిక్ మోటారును ఏర్పాటు చేయనుంది. షైన్ 100 ఇంజిన్‌ను గతంలో ఇన్‌స్టాల్ చేసిన ప్రదేశంలోనే ఎలక్ట్రిక్ మోటారును ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఇది ఇప్పటికే ఉన్న మౌంట్‌ల ద్వారా కనెక్ట్ చేయబడిరది. అలాగే.. భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ రోజురోజుకూ వేగంగా పెరుగుతోంది. మీరు మీ కోసం కొత్త ఎలక్ట్రిక్ బైక్ కొనాలని ప్లాన్ చేస్తుంటే హోండా త్వరలో కొత్త ఎలక్ట్రిక్ బైక్‌ను తీసుకురాబోతోంది. హోండా షైన్ 100 కమ్యూటర్ మోటార్‌సైకిల్ ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ బైక్‌పై హోండా పనిచేస్తోంది.

చౌకైన ఎలక్ట్రిక్ బైక్ కోసం ప్లాన్ : జపాన్ ద్విచక్ర వాహన తయారీదారు ఈ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ కోసం పేటెంట్ దరఖాస్తును దాఖలు చేశారు. రాబోయే ఎలక్ట్రిక్ వాహనం డిజైన్, సాంకేతిక ప్రణాళికను వెల్లడిరచారు. కంపెనీ చాలా సరసమైన ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇది ఇప్పటివరకు అధిక ధరల మోడళ్లచే ఆధిపత్యం చెలాయించిన విభాగంలో బ్రాండ్ తన స్థానాన్ని సంపాదించుకోవడానికి సహాయపడుతుంది.

ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం : ఇప్పటివరకు భారతీయ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఓలా ఎలక్ట్రిక్, అథర్ ఎనర్జీ వంటి స్టార్టప్ కంపెనీలు అయినా లేదా టీవీఎస్ మోటార్ కంపెనీ, హీరో మోటోకార్ప్ వంటి పాత కంపెనీలు అయినా, వారు తమ విడా ద్వారా మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేశారు. ఇటీవల కంపెనీలు కూడా ఈ విభాగంలోకి ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నాయి. కానీ పాత కంపెనీలు ఇంకా ఈ విభాగంలో తమదైన ముద్ర వేయలేకపోయాయి. రాబోయే ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ డిజైన్, సాంకేతికత గురించి అనేక ముఖ్యమైన సమాచారం పేటెంట్ ఇమేజ్ నుండి వెలుగులోకి వచ్చింది. హోండా షైన్ ఆధారిత ఎలక్ట్రిక్ బైక్‌ను విడుదల చేస్తే ఈ రంగంలో అలాంటి మొదటి బ్రాండ్ అవుతుంది.

హోండా షైన్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ : ఈ పేటెంట్ ప్రకారం.. తక్కువ ధర కలిగిన షైన్ 100 ఛాసిస్ పై నిర్మించే ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ పై పని చేస్తున్నట్లు తెలుస్తోంది. 2023 నాటికి భారతదేశంలో 300,000 యూనిట్లకు పైగా అమ్ముడైన షైన్ 100ను ఎంచుకోవడం వల్ల హోండా సమయం, డబ్బు ఆదా అవుతుంది. పూర్తిగా కొత్త ఛాసిస్‌ను అభివృద్ధి చేయడానికి చాలా సమయం పట్టడమే కాకుండా ఎక్కువ మొత్తంలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటికే ఉన్న ఫ్రేమ్‌ను ఉపయోగించి, దానిని కొద్దిగా సవరించడం ద్వారా ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ తయారు చేయడం చౌకైనదిగా మారవచ్చు.

ఎలక్ట్రిక్ మోటారు స్థానంలో పెట్రోల్ ఇంజిన్ : హోండా పెట్రోల్ ఇంజిన్ స్థానంలో ఎలక్ట్రిక్ మోటారును ఏర్పాటు చేయనుంది. షైన్ 100 ఇంజిన్‌ను గతంలో ఇన్‌స్టాల్ చేసిన ప్రదేశంలోనే ఎలక్ట్రిక్ మోటారును ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఇది ఇప్పటికే ఉన్న మౌంట్‌ల ద్వారా కనెక్ట్ చేయబడిరది. దీనికి రెండు బ్యాటరీ ప్యాక్‌లు ఉంటాయి. రెండు బ్యాటరీలు 10.2 కిలోల బరువు ఉంటాయి. దీనితో పాటు, హోండా ఇప్పటికే బ్యాటరీ స్వాపింగ్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. యాక్టివా ఇ ఎలక్ట్రిక్ స్కూటర్‌కు మద్దతుగా దీనిని విస్తరిస్తున్నారు. ఈ బ్యాటరీ స్వాపింగ్ నెట్‌వర్క్ దాని లాంచ్ తర్వాత షైన్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ అభివృద్ధిలో కూడా సహాయకరంగా ఉంటుందని భావిస్తున్నారు.




## ప్రత్యేక ఏఐ చాట్ బాట్ పిల్లల కోసం

పిల్లల కోసం విజ్ఞానదాయక కంటెంట్‌ను అందించే ప్రత్యేక చాట్‌బాట్‌ను తాము అభివృద్ధి చేస్తున్నట్టు ఎక్స్‌ఏఐ సంస్థ అధినేత ఎలాన్ మస్క్ తాజాగా పేర్కొన్నారు. దీని పేరు బేబీ గ్రోక్ అని చెప్పుకొచ్చారు. పిల్లల కోసం ప్రత్యేకమైన ఏఐ చాట్ బాట్‌ను ఎక్స్‌ఏఐ సిద్ధం చేస్తోందిన సంస్థ అధినేత ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. బేబీ గ్రోక్‌గా పేరు పడ్డ ఈ యాప్ పిల్లలకు అనువైన, విజ్ఞానదాయక కంటెంట్‌ను అందిస్తుందని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాట్‌బాట్‌ల కంటే బేబీ గ్రోక్ మరింత భద్రమైనదని ఆయన అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అయితే, ఈ కొత్త టూల్ ఎలా పని చేస్తుందో మాత్రం వివరించలేదు. ప్రస్తుతమున్న గ్రోక్ కంటే మరింత సరళతరంగా ఉండేలా బేబీ గ్రోక్‌ను డిజైన్ చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా పిల్లలకు తగిన కంటెంట్ ఇందులో అందుబాటులో ఉండేలా రూపొందిస్తున్నారట. గ్రోక్‌ను 2023లో లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్‌కు చెందిన జెమినీ, మెటాకు చెందిన లామాకు ప్రత్యామ్నాయంగా దీన్ని డిజైన్ చేశారు. ప్రస్తుతం గ్రోక్‌లో డీప్ సెర్చ్, థింక్, బిగ్ మైండ్ అనే మూడు మోడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఎంతటి వివరమైన సమాధానం కావాలో అనే దాన్ని బట్టి యూజర్లు ఈ మూడిరట్లో ఏదో ఒక మోడ్‌ను ఎంచుకుని గ్రోక్‌ను ప్రశ్నలు అడగొచ్చు. లేటెస్ట్ వర్షన్ అయిన గ్రోక్ 4 ఇటీవలే అందుబాటులోకి వచ్చింది. పీహెచ్‌డీ స్థాయి ప్రశ్నలకు కూడా ఈ వర్షన్ సమాధానాలు చెప్పగలదని మస్క్ అప్పట్లో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇది కొత్త విషయాలను కనుగొన్నా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. ఆ తరువాత గ్రోక్ యూదువ్యతిరేక కంటెంట్‌ను షేర్ చేయడం కాంట్రవర్సీకి దారి తీసింది. ఇక బేబీ గ్రోక్ ప్రకటనను అనేక మంది స్వాగతించారు. చాట్‌జీపీటీకి బదులుగా దీన్నే తమ పిల్లలకు సూచిస్తామని కొందరు అన్నారు. పలువురు ఈ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ మస్క్‌కు ధన్యవాదాలు తెలిపారు.


# ఈ యాప్స్ వెంటనే డిలీట్ చేయాలి..!

**ప్రభుత్వం హెచ్చరిక..!**

ప్రస్తుత కాలంలో డిజిటల్ ప్రపంచం రోజురోజుకు విస్తరిస్తోంది. ప్రజలు అనేక పనుల కోసం నెట్ ఉపయోగిస్తున్నారు, అదే సమయంలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో పలు యాప్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని కేంద్ర సూచించింది. రోజురోజుకూ ఓ వైపు డిజిటల్ వినియోగం పుంజుకుంటున్న నేపథ్యంలో మరోవైపు సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. సైబర్ కేటుగాళ్లు సామాన్య ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఉపయోగిస్తున్నారు. కొంత మందికి వాటి గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ నేరాలకు బలవుతున్నారు. కొందరు తెలియకుండానే వారి ఫోన్‌లను నేరస్తులకు అనుమతి ఇస్తున్నారు. దీనివల్ల వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రజలను జాగ్రత్తగా ఉండాలని కీలక సూచనలు జారీ చేసింది. దీంతోపాటు కొన్ని యాప్‌లను మీ ఫోన్ల నుంచి వెంటనే డిలీట్ చేయాలని సూచించింది.

**ఈ యాప్‌లను ఉపయోగించవద్దు** : ప్రభుత్వం సైబర్ నేరాల గురించి హెచ్చరిస్తూ, స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని కోరింది. దీంతోపాటు ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసిన వాటిని వెంటనే డిలీట్ చేయాలని తెలిపింది. ఈ యాప్‌లు మీ ఫోన్ స్క్రీన్‌ను నేరస్తులకు చూపిస్తాయని, దీనివల్ల వారు మీ ఓటీపీలు, సందేశాలు, బ్యాంకు వివరాల వంటి సున్నితమైన సమాచారాన్ని చూసే ఛాన్సుందని వెల్లడిరచింది. ఈ యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయవచ్చు. కాబట్టి, ఈ రకమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం లేదా ఉపయోగించడం పూర్తిగా మానేయాలని సూచించారు.

**అనుమతులు ఇస్తున్నప్పుడు జాగ్రత్త** : కొత్త యాప్‌ను ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అది కొన్ని అనుమతులు అడుగుతుంది. చాలా మంది వాటిని చదవకుండా అన్నింటికీ అనుమతించు అని ఒప్పుకుంటారు. ఇది చాలా ప్రమాదకరమని కూడా హెచ్చరించారు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లు మీ ఫోన్‌లోని అన్ని కార్యకలాపాలను నేరస్తులకు చూపిస్తాయని ప్రస్తావించారు. ఉదాహరణకు, మీరు బ్యాంకు లావాదేవీలు చేస్తున్నప్పుడు వచ్చే ఓటీపీలను వారు చూసే అవకాశం ఉంది. అందుకే యాప్‌లకు అనుమతులు ఇచ్చే ముందు జాగ్రత్తగా చూసి పర్మిషన్ ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలను నివారించడానికి సోషల్ మీడియా సీక్రెట్ సెట్టింగ్‌లు కూడా చాలా ముఖ్యమని గుర్తు చేశారు. ఈ క్రమంలో మీ సోషల్ మీడియా ఖాతాలలో సెట్టింగ్‌లను సరిచేసుకోవాలన్నారు. మీ వ్యక్తిగత సమాచారం అందరికీ కనిపించకుండా చూసుకోవాలన్నారు. ఉదాహరణకు మీ ఫోన్ నంబర్, చిరునామా, ఫోటోలు వంటివి అందరికీ బహిర్గతం కాకుండా పరిమితం చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల సైబర్ నేరస్తులు మీ సమాచారాన్ని దుర్వినియోగం చేయడం కష్టమవుతుందని గుర్తు చేశారు.



**ఈ జాగ్రత్తలు తప్పనిసరి** : స్క్రీన్ షేరింగ్ యాప్‌లను తొలగించండి: ఇప్పటికే ఇలాంటి యాప్‌లు మీ ఫోన్‌లో ఉంటే వెంటనే డిలీట్ చేయండి. కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అడిగే అనుమతులను జాగ్రత్తగా చదవండి. మీ సోషల్ మీడియా ఖాతాలలో గోప్యతా సెట్టింగ్‌లు సరిగ్గా ఉన్నాయో చెక్ చేయండి. తెలియని లింక్‌లు లేదా మెసేజులను క్లిక్ చేయకండి. మీ స్మార్ట్‌ఫోన్ సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండండి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లండ్‌కే..
# పట్టంకట్టిన ఐసీసీ..!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ఆతిథ్యంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మూడుసార్లు టెస్టు గద సమరాన్ని నిర్వహించిన ఇంగ్లండ్ బోర్డుకే పట్టం కట్టింది. వచ్చే సీజన్ ఒక్కటే కాదు మరో రెండు ఫైనల్స్ బాధ్యతను కూడా ఈసీబీకే రాసిచ్చింది. 2027, 2029, 2031 టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌స్‌కు ఈసీబీనే ఆతిథ్యం ఇవ్వనుంది. గత మూడు సీజన్ల డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లండ్‌లోనే జరిగాయి. దాంతో.. ఈసీబీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని.. వచ్చే సీజన్లకు వేదికను మారిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. కానీ, ఈసీబీ అత్యంత పకడ్బందీగా ఈ మ్యాచ్‌లను నిర్వహించింది. అంతేకాదు అక్కడి ప్రేక్షకులు ఐదు రోజుల ఆటను చూసేందుకు భారీగా తరలివచ్చారు కూడా. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ.. డబ్ల్యూటీసీ టైటిల్ పోరును సమర్థంగా నిర్వహించిందినందున.. వేదికను మార్చడం సరైంది కాదని భావించింది. దాంతో.. 2027 ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశ పడిన బీసీసీఐకి భంగపాటు ఎదురైంది. ఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇంగ్లండ్ బోర్డు సంతోషం వ్యక్తం చేసింది. న్యూజిలాండ్ మొదటి ఛాంపియన్ : టీ20లు.. ఫ్రాంచైజీ క్రికెట్‌ల విస్తరణతో కళ తప్పుతున్న సుదీర్ఘ ఫార్మాట్‌కు ఊపిరిలూదేందుకు ఐసీసీ 2019 21లో టెస్టు ఛాంపియన్‌షిప్‌ను తెరపైకి తీసుకొచ్చింది. తొలి ఎడిషన్‌ను ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ మైదానంలో నిర్వహించారు. భారత్‌ను ఓడిరచిన న్యూజిలాండ్ మొట్టమొదటి ఛాంపియన్‌గా అవతరించింది. రెండో సీజన్ ఫైనల్ కూడా ఇంగ్లండ్‌లోనే. ఈసారి కూడా ఫలితం మారలేదు. ఓవల్ స్టేడియంలో టీమిండియాను 209 పరుగుల తేడాతో చిత్తు చేసి ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఈమధ్యే లార్డ్స్ వేదికగా జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఎడెన్ మర్‌క్రమ్ సూపర్ సెంచరీకి తోడు.. రబడ విజృంభణతో దక్షిణాఫ్రికా సంచలనం సృష్టించింది. అంతే.. రెండోసారి టెస్టు గదను తన్నుకుపోవాలనుకున్న కమిన్స్ సేనకు చెక్ పెట్టింది. తొలిసారి జగజ్జేతగా నిలిచిన ప్రొటీస్ జట్టు ఐసీసీ ట్రోఫీ గెలవాలనే తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకుంది.

# 4వ టెస్ట్ మ్యాచ్ కోసం గంభీర్ స్కెచ్..?

**ముగ్గురు కీపర్లతో బరిలోకి భారత జట్టు..**

ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగే నాల్గవ టెసట్‌కు ముందు రిషబ్ పంత్ గాయం గురించి ఆందోళనలు ఉన్నాయి. లార్డ్‌స్‌లో తగిలిన గాయం నుంచి అతను కోలుకోకపోతే, భారత జట్టు ముగ్గురు వికెట్ కీపర్లను ఆడిరచాల్సి వస్తుంది. పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడని, కానీ అతను వికెట్ కీపింగ్ చేస్తాడా లేదా అనే సందిగ్ధం అందరిలో ఉందని కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ తెలిపాడు. పంత్ ఆడకపోతే, కేఎల్ రాహుల్ లేదా ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్లుగా ఉండవచ్చని తెలిపాడు. భారత్ , ఇంగ్లాండ్ మధ్య నాల్గవ టెస్ట్ మ్యాచ్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతుంది. ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో వెనుకబడిన భారత జట్టు, ఈ మైదానంలో గెలిచి స్కోరును సమం చేయాలని చూస్తోంది. ఈ మైదానంలో ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా గెలవని టీమ్ ఇండియా చరిత్ర సృష్టించాలంటే బలమైన జట్టును రంగంలోకి దించాలి. అయితే, మూడవ టెస్ట్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఫిట్‌నెస్ గురించి ఆందోళనలు ఉన్నాయి. టెస్ట్ ప్రారంభానికి ముందు పంత్ కోలుకోకపోతే, టీమ్ ఇండియా తరపున ముగ్గురు వికెట్ కీపర్లు మైదానంలో ఉండే అవకాశాలు ఉన్నాయి.






లార్డ్‌స్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ తొలి రోజున వికెట్ కీపింగ్ చేస్తున్నప్పుడు రిషబ్ పంత్ గాయపడ్డాడు. అతని ఎడమ వేలికి గాయం కావడంతో మ్యాచ్ మొత్తం అతను వికెట్ కీపింగ్ చేయలేకపోయాడు. అయితే, రెండు ఇన్నింగ్‌స్‌లలో బ్యాటింగ్ చేసిన పంత్, మొదటి ఇన్నింగ్‌స్‌లో అర్ధ సెంచరీ సాధించాడు. రెండవ ఇన్నింగ్‌స్‌లో చాలా త్వరగా ఔటయ్యాడు. అయితే, ఈ ఇన్నింగ్‌స్‌లో బ్యాటింగ్ చేస్తున్న కొద్దీ అతని వేలిలో నొప్పి తీవ్రమవుతోందని స్పష్టంగా తెలుస్తోంది.

పంత్ ఫిట్‌నెస్ గురించి కోచ్ ఏమన్నాడంటే..? : అయితే, టెస్ట్ మ్యాచ్ తర్వాత మాట్లాడుతూ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, మాంచెస్టర్ టెస్ట్ నాటికి పంత్ పూర్తిగా కోలుకుంటాడని తాను నమ్మకంగా ఉన్నానని చెప్పాడు. ఇప్పుడు, అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్‌చేట్ ప్రకటన అభిమానుల హార్ట్ బీట్‌ను పెంచింది. నాల్గవ టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమ్ ఇండియా బెకెన్‌హామ్‌లో ప్రాక్టీస్ చేస్తోంది. 'నాల్గవ టెస్ట్ ప్రారంభానికి ముందు పంత్ మాంచెస్టర్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ పంత్‌ను టెస్ట్ మ్యాచ్‌కు దూరంగా ఉంచాలని మేం కోరుకోవడం లేదు. అయితే, పంత్ వికెట్లు కీపింగ్ చేయగలడని కూడా మేం నిర్ధారించుకోవాలి. ఎందుకంటే, మ్యాచ్ మధ్యలో మళ్లీ కీపర్‌ను మార్చకూడదని మేం కోరుకుంటున్నాం.'

ముగ్గురు వికెట్ కీపర్లు ఆడతారా..? : మాంచెస్టర్ టెస్ట్ నాటికి రిషబ్ పంత్ పూర్తిగా ఫిట్ అవుతాడని, బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ కూడా చేయగలడని తాను నమ్మకంగా ఉన్నానని కోచ్ అన్నారు. కానీ అప్పటికి పంత్ ఫిట్ అవుతాడో లేదో ఇంకా స్పష్టంగా తెలియలేదు. కానీ, పంత్ వికెట్ కీపింగ్‌కు ఫిట్ గా లేకపోయినా, అతన్ని బ్యాట్స్‌మన్ గా ఆడిరచే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే బ్యాట్స్ మన్ గా మిడిల్ ఆర్డర్‌లో పంత్ ఉనికి చాలా ముఖ్యం. అటువంటి పరిస్థితిలో పంత్ బ్యాట్స్ మన్ గా మాత్రమే ఆడితే, టీం ఇండియా వికెట్ కీపర్ గా వేరొకరిని ఎంచుకోవలసి ఉంటుంది. కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ రూపంలో భారత దేశానికి 2 ఎంపికలు ఉన్నాయి. రాహుల్ గతంలో వికెట్ కీపర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. కానీ ఓపెనర్‌గా అతని అద్భుతమైన ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటే, అతనికి వికెట్ కీపింగ్ బాధ్యత ఇవ్వబడదని భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో, ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్‌గా ఫీల్డింగ్ చేయాల్సి ఉంటుంది. అంటే, మాంచెస్టర్ టెసట్‌లో, టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో ముగ్గురు వికెట్ కీపర్‌బ్యాట్‌స్‌మెన్‌లను రంగంలోకి దించినా ఆశ్చర్యం లేదు.

# మాంచెస్టర్ టెస్‌ట్‌కు వరుణ గండం.. పిచ్ ఎలా ఉంటుందంటే..?



మాంచెస్టర్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే నాల్గవ టెస్‌ట్‌పై వాతావరణం ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక్కడ వర్షం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇది మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేయవచ్చు. ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ బ్యాటర్లు బౌలర్లకు సమానంగా అనుకూలించనుంది. ఈ గ్రౌండ్‌లో భారత్ ఒక్క మ్యాచ్ గెలవకపోవడం గమనార్హం. ఇంగ్లాండ్ %% టీమిండియా మధ్య నాల్గవ టెస్ట్ మ్యాచ్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరగనుంది. ఈ సిరీస్‌లో రెండు జట్ల మధ్య ఇప్పటివరకు మూడు టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇంగ్లాండ్ 21తో ఆధిక్యంలో ఉంది. శుభ్‌మాన్ గిల్ జట్టు టెస్ట్ సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే.. మాంచెస్టర్ టెస్ట్ గెలవడం చాలా ముఖ్యం. ఇంగ్లాండ్ ఈ మ్యాచ్ గెలిస్తే, సిరీస్ ఆతిథ్య జట్టుకే వెళ్తుంది. అయితే ఈ టెస్ట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు ఉండడం ఆందోళన కలిగిస్తుంది. మ్యాచ్ జరిగే ఐదు రోజులూ వర్షం పడుతుందని నివేదికలు వస్తున్నాయి.

మాంచెస్టర్‌లో వాతావరణం ఎలా ఉంటుంది..? : అక్యూవెదర్ నివేదిక ప్రకారం.. జూలై 23న వర్షం పడే అవకాశం 25 శాతం ఉంది. బుధవారమే మ్యాచ్ ప్రారంభమవుతుంది. జూలై 24న కూడా వర్షం పడే అవకాశం 25 శాతం ఉంది. జూలై 25 శుక్రవారం నాడు వర్షం పడే అవకాశం 50 శాతం ఉంది. మ్యాచ్ యొక్క నాల్గవ రోజు అంటే జూలై 26న వర్షం పడే అవకాశం 25 శాతం ఉంది. జూలై 27న వర్షం పడే అవకాశం 58 శాతం ఉంది. అంటే వర్షం మ్యాచ్‌ను ఐదు రోజులూ అంతరాయం కలిగించవచ్చు. ఇది మ్యాచ్‌ను కూడా ప్రభావితం చేస్తుంది. పిచ్ ఎలా ఉంటుంది..? : మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో పిచ్ బ్యాట్‌స్‌మెన్, బౌలర్లు ఇద్దరికీ అనుకూలంగా ఉంటుంది. ప్రారంభంలో, ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుంది. అయితే బ్యాట్‌స్‌మన్ సెట్ అయితే మంచి స్కోర్ సాధించడానికి ఆస్కారం ఉంటుంది. స్పిన్నర్కు మ్యాచ్ యొక్క మూడవ రోజు అనుకూలంగా ఉండే ఛాన్స్ ఉంది. మ్యాచ్ చివరి రోజు బౌలర్లకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది. అప్పుడు బ్యాటింగ్ చేయడం చాలా కష్టంగా మారుతుంది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ చేయాలనుకుంటుంది. ఎందుకంటే ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో పెద్ద లక్ష్యాన్ని ఛేదించడం అంత తేలికైన పని కాదు.

# చిన్న జట్లకు పెద్ద ప్రోత్సాహం..
# ఎనిమిది బోర్డులకు డెవలప్‌మెంట్ అవార్డ్స్..!



క్రికెట్‌లో ఈమధ్య చిన్న జట్లు కూడా విశేషంగా రాణిస్తున్నాయి. పెద్ద టీమ్‌లకు షాకిస్తూ.. సంచలన విజయాలతో ఔరా అనిపిస్తున్నాయి. అందుకే సదరు బోర్డులకు ప్రోత్సాహకంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి అవార్డులు ప్రకటించింది. గతేడాది అద్భుతమైన ఆటతో వార్తల్లో నిలిచిన నేపాల్, భుటాన్, అమెరికాతో పాటు ఎనిమిది దేశాలను డెవలప్‌మెంట్ అవార్డ్స్2024కు ఎంపిక చేసింది ఐసీసీ. ఈ అవార్డు అందుకున్న వాటిలో ఇండోనేషియా, నమీబియా, స్కాంట్లాడ్, టాంజానియా, వనౌటు క్రికెట్ బోర్డులు ఉన్నాయి. సింగపూర్‌లో ఆదివారం ఐసీసీ ఛీఫ్ జై షా ఇతర సభ్యులతో కలిసి ఈ బోర్డులకు అవార్డ్స్ అందజేశారు. ప్రపంచ క్రికెట్‌లోఒకప్పుడు ఎనిమిది జట్ల పేర్లే ప్రముఖంగా వినిపించేవి. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంకలు మాత్రమే అభిమానులను అలరించేవి. కానీ, ఇప్పుడు దాదాపు ప్రతిదేశం క్రికెట్ జట్టును ఏర్పాటు చేసుకుంది. ఐసీసీ ప్రోద్బలం కూడా తోడవ్వడంతో అమెరికా, నేపాల్, స్కాట్లాండ్, నమీబియా వంటి చిన్న జట్ల సంచలనాలు సృష్టిస్తున్నాయి. తమ ప్రాంతంలో క్రికెట్ పురోగతికి కృషి చేస్తున్న ఈ దేశాల బోర్డులను ఐసీసీ డెవలప్‌మెంట్ అవార్‌డ్‌స్‌తో సత్కరించింది. మొత్తం 15 జట్లు షార్ట్ లిస్ట్ కాగా.. ఎనిమిది బోర్డులను ఎంపిక చేశారు.

# ఫుట్‌బాల్, క్రికెట్ స్టార్లు ఒక్కచోట..
# జెర్సీలు మార్చుకొని పోజిచ్చారిలా..!




క్రీడా చరిత్రలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. మైదానంలో బ్యాటుతో బంతితే చెలరేగే క్రికెటర్లు.. చిరుతల్లా కదిలే ఫుట్‌బాలర్లు ఒక్కచోట చేరారు. నాలుగో టెస్టుకుమ్యాచ్‌కు ఇంకా మూడు రోజులు ఉండడంతో ఆదివారం అడిడాస్ సంస్థ ఫొటోషూట్ ఏర్పాటు చేసింది. స్థానిక మాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ జట్టు ఆటగాళ్లతో కలిసి టీమిండియా ఆటగాళ్లు ఫొటోలు దిగారు. ఇరువురు తమతమ జెర్సీలు మార్చుకోవడం విశేషం. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాంచెస్టర్ సారథి బ్రునో ఫెర్నాండేజ్ జెర్సీ ధరించగా.. గిల్ టెస్టు జెర్సీతో బ్రునో మురిసిపోయాడు.లార్డ్స్ టెస్టులో అనూహ్య ఓటమితో సిరీస్‌లో వెనుకంజ వేసిన భారత జట్టు ఓల్డ్ ట్రఫోర్డ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. ఇప్పటికే మాంచెస్టర్ సిటీకి చేరుకున్న గిల్ సేన నెట్‌స్‌లో చెమటోడ్చుతోంది. అయితే.. ఆదివారం ఆట విడుపుగా టీమిండియా స్పాన్సర్‌గా ఉన్న అడిడాస్ సంస్థ స్థానిక ఫుట్‌బాల్ జట్టుతో ఫొటోషూట్ ఏర్పాటు చేసింది. అయితే.. ఫుట్‌బాలర్లు, మన క్రికెటర్లు పరస్పరం జెర్సీలు మార్చుకొని దిగడంతో ఈ ఫొటో ప్రత్యేకమైనది నిలిచిపోనుంది. క్రికెట్, ఫుట్‌బాల్ స్టార్లు చిరు నవ్వులు చిందుస్తున్న ఈ ఫొటో నెట్టింట వైరలవుతోంది. ఇరుజట్ల అభిమానులు అయితే ఈ అరుదైన ఫొటో చూసి సంతోషంలో మునిగితేలుతున్నారనుకో. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుకు ఇంగ్లండ్ పర్యటన సవాల్ విసురుతోంది. తొలి టెస్టులో పరాజయం తర్వాత సంచలన ఆటతో స్టోక్స్ బృందానికి చెక్ పెట్టింది టీమిండియా. అదే జోరును లార్‌డ్‌స్‌లోనూ చూపించినా.. 193 పరుగుల లక్ష్యాన్ని అందుకోలేక చతికిల పడిరది. ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వగా.. టెయిలెండర్లతో కలిసి రవీంద్ర జడేజా (62నాటౌట్) చేసిన ఒంటరి పోరాటమంతా వృథా అయ్యింది. 21తో సిరీస్‌లో వెనకబడిన గిల్ సేన ఓల్డ ట్రఫోర్డులో సమిష్టిగా రాణించి సిరీస్ సమం చేయాలనుకుంటోంది. అయితే.. ఓల్ట్ ట్రఫోర్డ్‌లో భారత్ గత తొమ్మిది మ్యాచుల్లో ఒక్కటీ గెలవలేదు. నాలుగింట ఇంగ్లండ్ గెలుపొందగా 5 మ్యాచులు డ్రాగా ముగిశాయి.

# భారత స్క్వాడ్‌లోకి యువపేసర్..!

లార్డ్స్ టెస్టులో అనూహ్యంగా ఓటమిపాలైన భారత జట్టుకు మరో షాకింగ్ న్యూస్. మాంచెస్టర్‌లో విజయంతో సిరీస్ సమం చేయాలనుకుంటున్న టీమిండియా మ్యాచ్ విన్నర్ ఆకాశ్ దీప్ సేవల్ని కోల్పోనుంది. బర్మింగ్‌హోమ్‌లో 9 వికెట్లతో ఇంగ్లండ్‌ను దెబ్బతీసిన ఆకాశ్ గాయపడ్డాడు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ సైతం గాయంతో బాధపడుతున్నాడు. సో.. ఈ ఇద్దరిలో ఒక్కరు కూడా మాంచెస్టర్ టెస్టులో ఆడడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇంగ్లండ్ లయన్స్ పై వికెట్ల వేట కొనసాగించిన యువ పేసర్ అన్షుల్ కంభోజ్ ను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. బర్మింగ్‌హమ్ టెస్టు రెండో ఇన్నింగ్‌స్‌లో హ్యారీ బ్రూక్ వికెట్ తీసిన తర్వాత ఆకాశ్ తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడ్డాడు. నొప్పి తగ్గకపోవడంతో మైదానం వీడిన అతడు కొద్ది సేపు విశ్రాంతి తీసుకున్నాడు. కాసేపయ్యాక మైదానంలోకి వచ్చినప్పటికీ ఆకాశ్ బౌలింగ్ చేయలేదు. దాంతో.. సిరాజ్, బుమ్రాలతో బౌలింగ్ చేయించాడు కెప్టెన్ గిల్. అర్ష్‌దీప్ విషయానికొస్తే.. ప్రాక్టీస్ సెషన్‌లో అతడి చేతివేలికి గాయమైంది. మాంచెస్టర్ టెస్టుకు ఇంకా మూడు రోజులే ఉంది. ఈ నేపథ్యంలో మూడో పేసర్‌గా అన్షుల్‌ను తీసుకోవాలని కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ గిల్ నిర్ణయించినట్టు సమాచారం. భారత ఏ జట్టుతో ఇంగ్లండ్‌కు వెళ్లిన ఈ పేసర్ లయన్స్ టీమ్‌పై నిప్పులు చెరిగాడు. మూడు ఇన్నింగ్‌స్‌ల్లో కలిపి 5 వికెట్లతో చెలరేగాడు. అంతేకాదు బ్యాటుతోనూ రాణించి అజేయ అర్ధ శతకం సాధించాడీ కుర్రాడు. కాబట్టి.. లోయర్ ఆర్డర్‌లో కొన్ని పరుగులు చేయగల అన్షుల్ నాలుగో టెస్టులో ఆడినా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.







# సచిన్ పేరు పక్కనే నా పేరు..

తన పేరుతో ట్రోఫీ నిర్వహించడంపై ఎట్టకేలకు ఇంగ్లండ్ వెటరన్ స్పందించాడు. క్రికెట్ లెజెండ్ సచిన్ పేరు పక్కన తన పేరు చూసుకొని ఎంతో గర్వంగా ఫీలయ్యానని చెప్పాడీ లెజెండరీ పేసర్. సుదీర్ఘ ఫార్మాట్‌లోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడైన జేమ్స్ అండర్సన్ ఇంగ్లండ్ జట్టుకు విశేష సేవలందించాడు. నలభై ఏళ్లు దాటినా యువకులతో పోటీ పడి బౌలింగ్ చేసిన జిమ్మీ.. నిరుడు వీడ్కోలు పలికాడు. అతడి గౌరవార్థం వాళ్ల బోర్డు అండర్సన్ %% టెండూల్కర్ ట్రోఫీకి శ్రీకారం చుట్టింది. తన పేరుతో ట్రోఫీ నిర్వహించడంపై ఎట్టకేలకు ఇంగ్లండ్ వెటరన్ స్పందించాడు. క్రికెట్ లెజెండ్ సచిన్ పేరు పక్కన తన పేరు చూసుకొని ఎంతో గర్వంగా ఫీలయ్యానని చెప్పాడీ లెజెండరీ పేసర్. 'క్రికెట్‌లో సచిన్ ఒక దిగ్గజం. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ సమయంలో అతడి పేరు పక్కన నా పేరు చూసి నేను అతడికి సరిసమానం కాదుగా అని మనసులో అనుకున్నా. కానీ, అత్యుత్తమ ఆటగాడైన సచిన్ పేరు.. నా పేరు పక్కపక్కనే ఉండడంతో చాలా గర్వంగా అనిపించింది. మన పేరుతో ట్రోఫీ నిర్వహించడమే గొప్ప విషయం. అలాంటిది గ్రేటెస్ట్ క్రికెటర్ అయిన మాస్టర్ బ్లాస్టర్ సరసన నాకు స్థానం దక్కడం అమిత సంతోషాన్నిచ్చింది. నేను పిల్లాడిగా అతడి ఆటను చూశాను. ఆ తర్వాత అతడికి ప్రత్యర్థిగా ఆడాను. భారత దేశ కీర్తిని తన భుజాలపై మోసిన సచిన్ ఒక ఐకానిక్ ప్లేయర్. అలాంటి వ్యక్తి పేరుతో ట్రోఫీని షేర్ చేసుకోవడం నిజంగా అదృష్టమే' అని అండర్సన్ వెల్లడిరచాడు. గొప్ప క్రికెటర్లుగా ఖ్యాతి గడిరచిన సచిన్ 200 టెస్టులు ఆడగా.. జిమ్మీ 188 మ్యాచుల్లో 704 వికెట్లు పడగొట్టాడు. క్రికెట్టే లోకంగా బతికే అండర్సన్ 42 ఏళ్ల వయసులో 'ది హండ్రెడ్ లీగ్'లో కుర్ర బ్యాటర్లను బెంబేలెత్తించేందుకు సిద్ధమవుతున్నాడు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నాలుగు సినిమాలతో అలరించనుంది

అందాల తార జాన్వీ కపూర్ హిందీతో పాటు తెలుగులోనూ పలు సినిమాలు చేస్తోంది. అవన్నీ ఇప్పుడు వరుసగా విడుదల డేట్స్ ఫిక్స్ చేసుకుంటున్నాయి. నిజానికి ఈ నెలలోనే ఆమె నటించిన బాలీవుడ్ చిత్రం పరమ్ సుందరి విడుదల కావాలి. కానీ చివరి నిమిషంలో వాయిదా పడిరది. వచ్చే నెల విడుదల అయ్యే అవకాశం ఉంది. అక్టోబర్‌లో మరో సినిమా రానుంది. కరణ్ జోహార్ నిర్మిస్తోన్న సన్నీ సంస్కారికీ తులసి కుమారి సినిమా దసరా కానుకగా అక్టోబర్ 2న విడుదల కానుంది. తాజాగా నిర్మాణ సంస్థ రిలీజ్ డేట్ ని ప్రకటించింది. డిసెంబర్ లో హోంబౌండ్ సినిమా విడుదల కానుంది. ఇది ఇప్పటికే కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ఆకట్టుకుంది. ఆమె నటిస్తున్న బడా తెలుగు చిత్రం పెద్ది. రామ్ చరణ్‌తో ఆమె నటిస్తోన్న మొదటి మూవీ. షూటింగ్ జరుగుతోంది. మార్చి 27, 2026న విడుదల కానుంది పెద్ది. మొత్తంగా ఈ భామ నుంచి వరుసగా నాలుగు సినిమాలు విడుదల కానున్నాయి.



# పొగడ్తలతో తేలుతున్న నిధి అగర్వాల్

సాధారణంగా పవన్ కళ్యాణ్ దర్శకులు, నిర్మాతలను పొగిడినంతగా హీరోయిన్లను ప్రశంసల్లో ముంచెత్తడం అరుదు. కానీ నిధి అగర్వాల్ ఆ ఛాన్స్ కొట్టేసింది. ఇవాళ జరిగిన హరిహర వీరమల్లు ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడుతూ నిధి అగర్వాల్ ప్రమోషన్ల భారాన్ని మొత్తం తన భుజాల మీద మోస్తుంటే తనకే సిగ్గనిపించిందని, సినిమాని అనాథలా వదిలేశామనే ఫీలింగ్ కలిగిందని, అలాంటిది లేదని చెప్పడానికి తాను సమావేశానికి వచ్చానని, నా చిత్రాన్ని నేనే ఎందుకు వదిలేస్తానని చెప్పుకొచ్చారు. నిధికి ఇది చాలా పెద్ద కాంప్లిమెంట్. అంటే ఆమె ఎంత సీరియస్ గా పబ్లిసిటీలో భాగం పంచుకుంటుందో పవన్ చూశారన్న మాట. పవన్ చెప్పినదాంట్లో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే సమయాభావం వల్ల హరిహర వీరమల్లులోని మెయిన్ క్యాస్టింగ్ ఎవరూ ఇంటర్వ్యూలకు అందుబాటులో లేరు. సత్యరాజ్, బాబీ డియోల్, సునీల్, సుబ్బరాజు లాంటి వాళ్ళు వేర్వేరు కారణాలతో వచ్చే పరిస్థితిలో లేదు. కీరవాణికి వ్యక్తిగతంగా కుటుంబంలో జరిగిన విషాదం వల్ల మీడియా ముందుకు రాలేకపోయారు. దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏఎం రత్నం పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో నిధి అగర్వాల్ అంతా తానై చూసుకుంది. ఒక రోజు ఏకంగా 16 మీడియా ఇంటర్వ్యూలు ఇచ్చి నాన్ స్టాప్ గా కో ఆపరేట్ చేసింది. ఇంత ఓపికగా ఉండటం అరుదే. ది రాజా సాబ్ డిసెంబర్ లో రిలీజ్ కానుండటంతో నిధి అగర్వాల్ కు ఇప్పుడీ హరిహర వీరమల్లు సక్సెస్ చాలా ముఖ్యం.

# కాంతారని తక్కువ అంచనా వేయొద్దు



రకరకాల అవాంతరాలు, అడ్డంకులు, యూనిట్ సభ్యుల హఠాన్మరణాలతో ఉక్కిరిబిక్కిరి అయిన కాంతార ఏ లెజెండ్ చాప్టర్ 1 షూటింగ్ అయిపోయింది. ఈ మేరకు అధికారిక మేకింగ్ వీడియోతో హీరో కం దర్శకుడు రిషబ్ శెట్టి దీన్ని ప్రకటించేశారు. ఏమైనా వాయిదా పడుతుందేమోననే ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేశారు. హోంబాలే ఫిలిమ్స్ బ్యానర్ మీద అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిన ఈ ప్యాన్ ఇండియా మూవీ మేకింగ్ వీడియో చూస్తే షాక్ తినడం ఖాయం. గొప్ప విజువల్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతున్న గ్యారెంటీని రెండు నిమిషాల వీడియోలోని ప్రతి ఫ్రేమ్ లో ఇచ్చారు. ఇందులో కంటెంట్ సంగతి పక్కనపెడితే కాంతార పోటీని తక్కువంచనా వేసిన ఎవరైనా ఇప్పుడు ఆలోచించుకోక తప్పదనేలా ఉంది. పేరుకి డబ్బింగ్ లా కనిపిస్తున్నప్పటికీ తెలుగులోనూ కాంతారకి కెజిఎఫ్ రేంజ్ లో సీక్వెల్ హైప్ ఉంది. ఎందుకంటే మొదటి భాగం ఎలాంటి అంచనాలు లేకుండా రెండు వారాలు ఆలస్యంగా రిలీజైనా నలభై కోట్లకు పైగా కలెక్షన్లు తెచ్చింది. దీంతో ఈసారి అంతకు మించి వసూలు చేస్తుందనే ధీమా బిజినెస్ వర్గాల్లో ఉంది. అక్టోబర్ 2 ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న కాంతార ఏ లెజెండ్ చాప్టర్ మీద అన్ని భాషలు కలిపి రెండు వందల కోట్లకు పైగానే బిజినెస్ జరిగేలా ఉంది. ఇక పోటీ విషయానికి వస్తే అక్టోబర్ 1 ధనుష్ ఇడ్లి కడాయ్ వస్తుంది. దానికన్నా వారం ముందు పవన్ కళ్యాణ్ ఓజి, బాలకృష్ణ అఖండ 2లో ఉన్నాయి కనక వెంటనే వారం గ్యాప్ లో కొత్త సినిమాలు రిలీజ్ చేసేందుకు టాలీవుడ్ నిర్మాతలు సాహసించడం లేదు. సో కాంతారకు ఓపెన్ గ్రౌండ్ ఉంటుంది.

# నిఖిల్ చెప్పింది ఆలోచించాల్సిన విషయమే

ఎంతసేపూ టికెట్ రేట్లు పెరగడం వల్లే జనాలు థియేటర్లకు రావడం తగ్గించేశారనే కోణంలోనే చర్చ జరుగుతోంది తప్ప నిజానికి క్యాంటీన్ లో అధిక ధరలకు అమ్ముతున్న స్నాక్స్ వల్ల ఎంత డ్యామేజ్ జరుగుతోందో ఇండస్ట్రీ పెద్దలు గుర్తించడం లేదు. అప్పుడప్పుడు ప్రెస్ మీట్లలో చర్యలు తీసుకుంటామని చెప్పడమే తప్పించి అవి అమలవుతున్న దాఖలాలు కనిపించవు. ముఖ్యంగా మల్టీప్లెక్సుల్లో ఈ దోపిడీ మాములుగా లేదు. పెద్ద స్టార్ హీరో సినిమాకు నైజాంలో గరిష్ట టికెట్ ధర 295 రూపాయలు ఉంటే పాప్ కార్న్ స్టార్టింగ్ రేట్ 300 నుంచి 900 రూపాయల దాకా ఉంటుంది. వాటర్ బాటిల్ వందకు అమ్ముతున్న ఉదాహరణలు ఎన్నో. తాజాగా హీరో నిఖిల్ దీని గురించి ఒక ట్వీట్ వేసి డిస్ట్రిబ్యూషన్ వర్గాలు సీరియస్ గా పరిష్కారం చూడాలని కోరాడు. తనకు సినిమా టికెట్ కు అయిన ఖర్చు కన్నా చాలా ఎక్కువ స్నాక్స్ కు పెట్టానని పేర్కొన్నాడు. ఇమేజ్, సంపాదన, ప్యాన్ ఇండియా మూవీస్ లో నటిస్తున్న మార్కెట్ ఉన్న నిఖిల్ కే అలా అనిపిస్తే ఇక మధ్య తరగతి ప్రేక్షకుల గురించి చెప్పేదేముంది. పిల్లలు అడిగితే కొనివ్వడకుండా ఉండలేని నిస్సహాయతను అనుభవించడం కన్నా అసలు మల్టీప్లెక్సులకే దూరంగా ఉంటే బెటరనే అభిప్రాయం మిడిల్ క్లాస్ జీవుల్లో ఉంది. అందుకే వీక్ డేస్ లో చాలా స్క్రీన్లు జనం లేక షోలు క్యాన్సిలవుతూ ఉంటాయి. కార్పొరేట్ ముసుగులో జరుగుతున్న ఈ దందా పూర్తిగా ఆపేయలేం కానీ కనీస నియంత్రణ అవసరం చాలా ఉంది. నిఖిల్ అన్నట్టు ఒక నీళ్ల బాటిల్ తీసుకెళ్లే స్వాతంత్రం లేనప్పుడు ఖర్చు మీద అదుపు ఎలా వస్తుంది. వసూళ్ల మాయలో పడి ఈ స్నాక్స్ ధరలు చేస్తున్న చేటు చాలా మంది గుర్తించడం లేదు. వీటి వల్ల ఎక్కువగా దెబ్బ తింటున్నది చిన్న బడ్జెట్, మీడియం రేంజ్ సినిమాలే.






# విశ్వంభర దర్శకుడి ఎంట్రీ

గత ఏడాది టీజర్ రిలీజై నెగటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చాక విశ్వంభర దర్శకుడు వశిష్ఠ మీడియాకు దొరకలేదు. షూటింగ్ లో బిజీగా ఉండటం, అపుడప్పుడు ప్రైవేట్ ఈవెంట్స్ లో కనిపించడం తప్ప తానుగా ఏదైనా చెప్పే చొరవ తీసుకోలేదు. ఇప్పుడు హఠాత్తుగా ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమా తాలూకు ప్రతీకూల ప్రచారాలకు చెక్ పెట్టే ప్రయత్నం చేయడం ఆశ్చర్యపరుస్తోంది. ఇంకా విడుదల తేదీ ఖరారు కాకుండా సడన్ గా ఎంట్రీ ఇవ్వడం మెగా ఫాన్స్ సైతం ఊహించలేదు. అందులోనూ స్టోరీ లైన్ చెప్పేయడం, సినిమా ప్రోగ్రెస్ ని స్పష్టంగా వివరించడం లాంటివి చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హరిహర వీరమల్లు రిలీజ్ ముంగిట్లో వశిష్ఠ ఇలా చేయడం వెనుక కారణమేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తే కొన్ని విషయాలు తెలిశాయి. ఎప్పుడో సంక్రాంతికి వచ్చే మెగా 157 మీద అటెన్షన్ ఎక్కువవుతోందని, కానీ దాని కన్నా ముందు రిలీజయ్యే విశ్వంభర మీద ప్రేక్షకుల్లో ఆసక్తి సన్నగిల్లడం మంచి సంకేతం కాదని భావించిన చిరంజీవి స్వయంగా వీటికి చెక్ పెట్టే బాధ్యతను వశిష్ఠకు అప్పజెప్పారట. ఇటీవలే మెగాస్టార్ ని కలిసిన కొందరు ఫ్యాన్స్ నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దానికి అనుగుణంగానే వసిష్ఠ విఎఫ్ఎక్స్, స్టోరీ పాయింట్ గురించి ఓపెన్ గా మాట్లాడేస్తున్నాడు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో విశ్వంభర రిలీజ్ ఉంటుందనే హింట్ ని వశిష్ఠ ఇవ్వడం చూస్తే పనులు చకచకా జరుగుతున్నట్టు కనిపిస్తోంది. కల్కి 2898 ఏడి, సూపర్ మ్యాన్ 2025కి పని చేసిన విదేశీ నిపుణులే ఇప్పుడీ విశ్వంభరకి వర్క్ చేయడం గురించి వశిష్ట గొప్పగా చెప్పుకున్నాడు.

# శ్రీలీల ఫ్యాన్స్ హర్టు

తొలి సినిమా ఫట్టయితే హీరో హీరోయిన్ల కెరీర్లు ముందుకు సాగడం కొంచెం కష్టమవుతుంది. కానీ కొన్ని సినిమాలు ఫెయిలైనా.. అందులో ఆర్టిస్టులకు పేరొచ్చి అవకాశాలు వరుస కడుతుంటాయి. ఇలాంటి అదృష్టమే దక్కింది శ్రీలీలకు. కన్నడనాట పుట్టి పెరిగిన ఈ తెలుగమ్మాయి.. 'పెళ్ళిసందడి' చిత్రంతో టాలీవుడ్లోకి అడుగు పెట్టింది. ఆ సినిమా నిరాశపరిచినా.. శ్రీలీల తన అందం, డ్యాన్సులతో యువతను ఆకట్టుకోవడంతో అవకాశాలకు లోటు లేకపోయింది. చూస్తుండగానే స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఐతే ఇప్పటిదాకా చేసిన చిత్రాల్లో శ్రీలీల గ్లామరస్‌గా కనిపించింది కానీ.. హద్దులు దాటేమీ అందాలు ఆరబోయలేదు. క్యూట్‌గా అనిపించే శ్రీలీల లాంటి వాళ్లు అతిగా ఎక్స్‌పోజింగ్ చేసినా, బోల్డ్ సీన్లలో నటించినా అంత బాగుండదు అనే అభిప్రాయం ఉంది. కానీ తన కొత్త చిత్రంలో మాత్రం శ్రీలీల బోర్డర్ దాటేసిందని తన ఫ్యాన్స్ ఫీలయిపోతున్నారు. కర్ణాటక రాజకీయ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి హీరోగా పరిచయం అయిన 'జూనియర్'లో శ్రీలీల కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే. శ్రీలీల ఇప్పుడున్న రేంజికి ఒక కొత్త హీరో సినిమాలో కథానాయికగా నటించడం ఒకింత ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐతే భారీ పారితోషకం ఇచ్చి ఆమెను సినిమాకు ఒప్పించారు. కానీ ఈ సినిమాలో శ్రీలీలది మరీ మొక్కుబడిగా సాగే పాత్ర. కేవలం పాటల కోసం మాత్రమే ఆ క్యారెక్టర్ ఉపయోగపడిరది. ఇది ఆమె ఫ్యాన్స్‌కు రుచించలేదు. పైగా 'వైరల్ వయ్యారి' పాటలో శ్రీలీల అప్పీయరెన్స్, హీరో ఆమెతో హద్దులు దాటి చేసిన రొమాన్స్ పట్ల సోషల్ మీడియాలో ఆమె అభిమానుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in